సంపూర్ణ నీతిచంద్రిక

[ప్రథమ భాగము]

మిత్రలాభము - మిత్రభేదము

విద్వాన్ బులుసు సీతారామశాస్త్రి

పబ్లిషర్సు: అద్దేపల్లి అండ్ కొ
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

ప్రథమ ముద్రణము
1955

ఒక రూపాయి

విషయసూచిక

పుట

సంపూర్ణ నీతిచంద్రిక

ఉపోద్ఘాతము

భారత భూమియందుఁ బ్రవహించుచుండు పవిత్రనదులలో గంగానది మిక్కిలి ప్రసిద్ధి కెక్కినది. ఆనది యొడ్డున సంపదలతో నిండిన పాటలీపుత్ర మను నగరము గలదు. సమస్తమయిన ప్రభుగుణములు గలిగిన సుదర్శనుఁ డను రాజానగరముఁ బరిపాలించుచుండెను.

ఒకనాఁ డొక బ్రాహ్మణుఁడు పఠించుచున్న రెండు శ్లోకము లారాజు వినుట సంభవించెను. ఆ శ్లోకములభావ మిది:

"మానవులకు సందేహము లన్నియుఁ బోఁగొట్టి, సామాన్యదృష్టి కందని విషయములను గోచరింపఁజేయు నయనము శాస్త్రము. అది లేనివాఁడు కను లుండియు గ్రుడ్డివాఁడే. యౌవనము, ధనసంపద, ప్రభుత్వము, నవివేకము నను నాల్గింటిలో నే యొక్కటియైన ననర్థము గలిగింపఁ జాలును. ఈ నాలుగు విషయములు నొక్కచోటఁ గూడి యున్నచో వేఱుగాఁ జెప్పనవసరములేదు."

సుదర్శనుని కుమారులు శాస్త్రము లభ్యసింపక యెల్లపుడుఁ జెడుదారుల సంచరించుచు నాటపాటలం దాసక్తులై

యుండిరి. బ్రాహ్మణుఁడు చదివిన శ్లోకములు విని రాజు తన కొమరులను గుఱించి యిట్లు తలపోసెను.

"విద్వాంసుఁడుకాని పుత్రుఁడు జనించినఁ బ్రయోజన మేమియులేదు. కంటిబాధయేకాని గ్రుడ్డికంటివలన నుపయోగ మేమి యుండును? గుణవంతులలో లెక్కకురాని సుతునిఁ గన్న తల్లియుఁ బుత్రవతియే యనిపించుకొన్న యెడల నింక గొడ్రాలన నెవరు? దానమున, దపమునఁ, విద్యయందు, నర్థలాభమునఁ బ్రశస్తినొందని సుతుఁడు గలుగుట కేవలము తల్లుల కడుపుఁజేటుకాదా?

వేలకొలఁదిగా నుండు తారలకంటెఁ జందమామ యొక్కఁడే చీకటి సంపూర్ణముగా హరింపఁ గలుగును. అటులే గుణహీనులగు పలువురు సుతులకంటె గుణవంతుఁడగు కుమారుఁ డొక్కఁడే కులమునకుఁ గీర్తి తేఁగలుగును. ధార్మికుఁడు, గుణవంతుఁడు, చెప్పినమాట వినువాఁడు నగు పుత్రుఁడు మహాతప మొనరించిన వారికే కాని లభించుట కష్టము. ధనలాభము, ఆరోగ్యము, ప్రియురాలగు భార్య, చెప్పుచేతలలో నుండు సుతుఁడు, నర్థసంపాదనమునకుఁ బనికివచ్చు విద్యయు లోకమున దుర్లభములు. పండితుఁడు గాని పుత్రునిఁ బుత్రుఁ డనుటకంటెఁ శత్రుఁ డనుట యుక్తము. ఎట్టి వంశమున జనించినను విద్వాంసుఁడైనయెడలఁ బూజితుఁ డగును. ఉన్నతవంశమున జననమొందినను బండితుఁడుకానివానికి గౌరవము కలుగనేరదు. సద్వంశజనితమైనను గుణరహితమగు

ధనువునకు విలువ యుండదు గదా! ఆహారము, నిద్ర మున్నగులక్షణములు మానవులకు నితరజంతువులకు సమాన ములే. ధర్మాధర్మముల వివేకమే మానవునియందలి విశేషము. ఆ వివేకమునకు విద్యయే మూలము. విద్యలేని మానవుఁడు వింతపశు వనఁబడును" అని కొంతసేపు దుఃఖించెను.

మరల "సర్వవిధముల యత్నించి సుతులను సుగుణ వంతులుఁగాఁ జేయఁదగును. వట్టికోరికలతో నూరకుండక తగువిధమునఁ బ్రయత్నించిన దేవుఁడును సాయపడకపోఁడు. కుమారులకు విద్యాభ్యాసము చేయింపకున్న దోసము తలి దండ్రులది. ఒంటిచక్రమువలన రథమునకు నడక గలుగని యట్లు పురుషయత్నము, దైవసాహాయ్యముఁ గూడిరానిచోఁ గార్యములు సిద్ధింపవు. కావునఁ దగిన ప్రయత్న మొనరించె దను" అని దీర్ఘముగా నాలోచించి మఱునాఁడు పండితు లందఱను రావించి సభగావించి వారితో నిట్లు పలికెను.

"విద్వాంసులారా! విద్యావిహీనులై యెల్లవేళలఁ జెడుదారులఁ దిరుగుచున్న నాసుతులకు నీతిశాస్త్ర ముపదే శించి గుణవంతులను జేయఁజాలు పండితు లెవ్వరైనఁ గలరా?"

ఇట్లు ప్రశ్నింపఁగా మహాపండితుఁ డగు విష్ణుశర్మ యను భూసురుఁడు "రాజా! ఉత్తమకులమున జనించిన నీసుతులను విద్వాంసులుగాఁ జేయుట యెంతపని? నీకులమున నపండితు లెట్లు పుట్టుదురు?

ఎంతయత్నించినను బకమును మధురముగాఁ బలికింప లేముగాని, చిలుకను బలికించు టేమికష్టము? నీకుమారుల నాఱుమాసములలో నీతిశాస్త్రజ్ఞుల నొనరించి యొప్పగింపఁ గలను" అని బదులు పలికెను.

అందులకు రాజెంతయు సంతసించి యిట్లనెను "గాజు బంగారముతోడి సంబంధమున మరకతమణికాంతి నొందును. అట్లే సజ్జనస్నేహము నొందిన మూర్ఖుఁడును నేర్పు సంపాదింపఁ గలఁడు గదా! కీటకము కుసుమ సంపర్కమున సుజనుల శిర మెక్కును. సత్పురుషులు ప్రతిష్ఠించుటవలనఁ బాషాణమే దైవత్వము నొందును. నదీగతములగు జలములు సుఖముగాఁ ద్రాగుటకు యోగ్యములు. సముద్రగతములగు నా సలిలములే త్రావుట కయోగ్యము లగును. ఆడువారి కనులయం దుంచఁబడిన నల్లని కాటుకయు నందము నొందు నట్లు దుర్జనుఁడును మంచివారి యాశ్రయమువలన రాణించును. మిముఁ బోలు పండితులకడఁ జేరి నాసుతులు నీతివిదు లగుట వింతకాదు. కావున వారలకు విద్యయొసఁగు భారము మీాయదియే." యని పలికి బహుమాన పూర్వకముగా విష్ణుశర్మకు సుదర్శనుఁడు తనకుమారుల నొప్పగించెను.

పిమ్మట విష్ణుశర్మ యారాజకుమారుల నొక సుందరమైన భవనమునకుఁ గొనిపోయి సుఖముగా గూరుచుండఁ జేసి వారితో నిట్లు పలికెను.

"సుజనులు కావ్యశాస్త్రవినోదమునఁ గాలము గడుపుదురు. మూర్ఖులు నిద్రావ్యసనకలహములతోఁ గడుపుదురు. కావున మీకు వినోదముకొఱకు విచిత్రమయిన చక్కని నీతిశాస్త్రకథలు చెప్పెదను. అందు మిత్రలాభము, మిత్రభేదము, విగ్రహము, సంధి యను నాలుగు భాగములు గలవు. వానిలో ముందు మిత్రలాభముఁ దెలుపుదును. ఆ భాగమునఁ గాక కూర్మాదులు స్నేహమువలన నెంతయో లాభ మొందినవి. వాని కథ కడుంగడు విచిత్రము. వినుఁడు."

కథాప్రారంభము

మిత్రలాభము

చిత్రగ్రీవుఁ డను కపోతరాజు వృత్తాంతము

పూర్వము గోదావరీతీరమున నొక గొప్ప బూరుగుచెట్టు గలదు. అన్ని దెసలనుండియు వచ్చి పక్షులు రాత్రి యా చెట్టుపై నివసించుచుండెడివి. ఒకనాఁటి వేకువవేళ లఘుపతనక మను కాకము మేలుకాంచి యమునివలె భయంకరుఁడై యున్న కిరాతు నొకనిఁ జూచి "లేవఁగానే యనిష్టదర్శన మైనది. నేఁ డేమి కీడు మూడునో కదా!" యని కలఁత నొందెను. అంతలో బోయవాఁ డావృక్షముచెంత నూకలు చల్లి, వలపన్ని దాఁగి యుండెను.

అనంతర మాకాశమునఁ బరివారముతో సంచరించు చున్న చిత్రగ్రీవుఁ డనెడి పావురములరాజు నేలమీఁద నున్న నూకలు జూచి భ్రమపడుచున్న తన తోడి పావురములతో నిట్లనెను. "నిర్జనమగు నీవనమున నూక లెట్లు వచ్చినవి ? మన మీ నూకల కాసపడినచోఁ బూర్వము కంకణమునకై యాసించి పులిచేతఁ జిక్కి మరణించిన బాటసారివలె నపాయము నొందవచ్చును. మీ కాకథ చెప్పెదను వినుఁడు.

కంకణమున కాసించి పులిచేఁ జంపఁబడిన బాటసారి కథ

పూర్వ మొకపుడు దక్షిణదేశపు టడవిలోఁ దిరుగుచుఁ జూచితిని. ఒక ముసలిపులి స్నానముచేసి దర్భలు చేతఁబట్టుకొని యొకచెఱువుగట్టున నుండి "ఓయి బాటసారీ! ఇదిగో బంగరు కంకణము. దీనినిఁ దీసికొనుము" అని పలుకుచుండెను.

పేరాసకు లొంగిన యొక బాటసారి "నిస్సందేహముగా నిది నాయదృష్టము. అనుమానములు పెట్టుకొని కూరుచున్నచో ధనార్జనమే కష్టము. అయినను త్వరపడరాదు. పరిశీలించెదను గాక" యని తలఁచి "కంకణ మేది ? చూపుము" అని యాపులి నడిగెను.

"ఇదిగో బంగరు కంకణము. చూడుము." అని పులి చేయి చాచి చూపెను.

"నీవు క్రూరజంతువవు. నిన్నెలాగున నమ్మవచ్చును?" అని యాబాటసారి ప్రశ్నించెను.

దాని కా పులి యిట్లు బదులు పలికెను "నీ వన్నట్లు యౌవనమున నే నతిదుర్మార్గుఁడనై యుంటిని. అనేకములగు గోవులను, మనుజులను జంపితిని. ఆపాపముచేతనే యాలుబిడ్డలను గోలుపోయి వంశహీనుఁడనై యుంటిని. పిమ్మట నొక పుణ్యాత్ముఁడు "గోవులను, మనుజులను చంపుట మానివైచి దానధర్మములు చేయుము" అని నాకు బోధించెను. నాఁటి నుండియు స్నానదానాదులు చేయుచుంటిని.

గోళ్లు, దంతములులేని ముదుసలిని. నే నెవరి కేమి యపకారము చేయఁగలను? ధర్మమార్గమునకు లోభము లేకుండుట మొదటి సోపానము. చేతఁ జిక్కిన కంకణమును దాన మిచ్చుచున్న నాకు లోభము లేదనుసంగతి తెల్లమే కదా!

అయినప్పటికిఁ బులులు మనుజులఁ జంపునని లోకప్రసిద్ధి. దాని నెవరు వారింపఁగలరు? గ్రుడ్డినమ్మకమే కాని ధర్మమును గనిపెట్టుట లోకమున నఱుదు. మరుస్థలమునఁ గురియు వానవలెను, నాకలిగొన్నవాని కిడు భోజనమువలెను, పేదలకొఱకుఁగు దానము ప్రశస్తము. నీవు దరిద్రుఁడవనియు, సర్వవిధములఁ బాత్రుఁడవనియు దీనిని నీకీయఁ దలఁచితిని. రోగముగలవాని కౌషధ మీయవలయునుగాని యారోగ్యవంతున కిచ్చిన నేమి యుపయోగము? కావున నీ చెఱువులో స్నానముచేసి వచ్చి దీనిని గ్రహింపుము. సంశయింపకుము."

ఇట్లు పలికిన పులిమాటలకు లోఁబడి యాబాటసారి స్నానమునకై చెఱువున దిగఁబోయి పెనుఁబొంపిలో దిగఁబడి

కదలఁజాలఁ డయ్యెను. అవు డాపులి "అయ్యో! బురదలోఁ బడిపోయితివి. నిన్ను లేవఁదీయుదు" నని నెమ్మదిగా సమీపమున కేగి యాతనిఁ బట్టుకొనియెను.

అట్లు పట్టువడి, "క్రూరజంతువును నమ్మి గొప్ప తప్పిద మొనరించితిని. నదులయందును, శస్త్రప్రాణులయందును, గోళ్లు కలిగిన జంతువులందును, కొమ్ములు కలిగిన జంతువులందును, స్త్రీలయందును, రాజకులములందును విశ్వాస ముంచరాదని పెద్దలు వచింతురు. గతించిన దానికి విచారించినఁ బ్రయోజనమేమి? విధిఁ దప్పించుకొన నెవ్వరికిఁ దరమగును? చంద్రుఁ డున్నతమైన గగనమార్గమునఁ జరించును; కల్మషమును హరించును. అనేకకిరణములను ధరించుచు జ్యోతిర్మధ్యమున సంచరించును. అంతటి ఘనుఁ డైనను రాహుకేతువులచే మ్రింగఁబడుట తప్పలేదుగదా!" అని విచారించుచుఁ బులిచేఁ జంపఁబడెను.

బాగుగా జీర్ణమయిన యన్నమును, జక్కఁగాఁ జదివిన కుమారుఁడును, సుశిక్షితురాలైన స్త్రీయును, బాగుగా సేవింపఁబడిన ప్రభువును, ఆలోచించి యాడిన మాటయు, నిదానించి యొనరించిన కృత్యమును నెన్నఁడు హాని కలిగింపవు. కాఁబట్టి బాగుగా నాలోచింపనిదే యేపనియుఁ జేయరాదు.

చిత్రగ్రీవుఁడు పలికిన యీమాటలు విని యొకపావురము నవ్వి గర్వముతో నిట్లనెను. "ఎల్లపుడు నిట్టి యుపయోగములేని శంకలు పెట్టుకొన్నచో నాహారము సంపా

దించుకొని జీవించుటయే కష్టమగును. అసూయగలవాఁడు, నిందగలవాఁడు, సంతోషము లేనివాఁడు, కోపస్వభావుఁడు, పరులపోషణపై నాధారపడువాఁడు, నెల్లపుడు సందేహముతోఁ గూడియుండువాఁడు నను నీ యాఱుగురు దుఃఖభాగులని పెద్దల వచనము" ఈ మాటలు విని పావురములన్నియు నచట (వాలి బోయవాఁడు పన్నిన వలలోఁ దగులుకొనెను.

"లోభము కడు దుష్టగుణము కదా! అన్నివిషయములుఁ దెలిసియుండియుఁ, బరుల సంశయములు దీర్ప నేర్పరులయ్యు లోభమునకు లొంగి మిగులఁ గష్టపడుదురు. లోభమె సమస్తదోషములకు మూలము. బంగరులేడి జనించుట యసంభవమయినను శ్రీరామునంతటివాఁడు లోభపడి హానిఁ జెందెను. ఆపద రానైయున్న కాలమున నెంతటివారి బుద్ధియు మలిన మగును."

వలలోఁ జిక్కిన పావురము లన్నియు సంశయము పనికి రాదని తమ కాలోచనము చెప్పిన పావురమును నిందింపఁ దొడఁగినవి.

"గుంపునకు ముందు మార్గదర్శకుఁడుగా నుండరాదు. కార్యము సఫల మయినయెడల ఫలిత మందఱకు సమానమే. కార్యము చెడిపోయినచో నిందమాత్రము మార్గదర్శకునకు వచ్చును."

పావురములు నిందించుట చూచి చిత్రగ్రీవుఁడు వానితో నిట్లనెను. "ఆపద రానైయున్నపుడు మేలు కూడఁ గీడుగా

మాఱుచుండును. ఇది కేవల మీతని తప్పుగాదు. ఆపద కలిగినపుడు తప్పించుకొను నుపాయ మాలోచింపవలయునే కాని యొకరినొకరు నిందించుకొనుట కాపురుషుల లక్షణము. ఆపదనుండి తప్పింపఁగల సమర్థుఁడే బంధు వనఁదగును గాని వృథా నిందాపరుఁడు బంధువు కాఁజాలఁడు.

ఆపదయందు ధైర్యము, నభివృద్ధి గలిగినపు డోర్పు, సభలయందు మాటనేర్పు, యుద్ధములయందు శౌర్యము, కీర్తియం దభిరుచియు, శాస్త్రశ్రవణమునందు వ్యసనము నను నీ గుణములు మహాత్ములకు స్వాభావసిద్ధములు. కాఁబట్టి ధైర్య మవలంబించి ప్రతిక్రియ యాలోచింపఁదగును.

మన మందఱము నేకీభవించి వలయెత్తుకొని యెగిరి పోవుదము. 'అల్పులమగు మన కీపని యెట్లు శక్య మగు' నని తలఁపకుఁడు. అల్పములగు గడ్డిపరకలు పెనవైచుకొని మదించిన యేనుఁగును సహితము బంధింపఁ గలుగుచున్నవి. అల్పమైన యూక తొలఁగింపఁబడిన సారవంతమగు బియ్యపుగింజ మొలకెత్తఁజాలదు. మన మందఱముఁ గలిసినచో నీపని కష్టము గాదు." అని తమ ఱేఁడు పలికిన మాటలు విని యా కపోతములన్నియు వల యెగఁ దన్నుకొని యాకసమున కెగిరిపోయెను.

అనంతర మాబోయవాఁ డది చూచి "యీపక్షులు గుమిగూడి వలఁ దన్నుకొని పోవుచుండెను. నేలపైఁ ద్రాలఁ గానే పట్టుకొందునుగాక" యని తలఁచి వెంటఁ బోవుచుండెను.

అవి కనుచూపుమేర దాఁటిపోఁగా నాతఁడు నిరాశుఁడై మరలి తనతావునకుఁ బోయెను.

ఆతఁ డట్లు మరలిపోవుట చూచి "మన కిపుడు కర్తవ్యమేమి?" యని యాపక్షు లడుగఁగాఁ జిత్రగ్రీవుఁ డిటు లనియెను.

"లోకమునఁ దల్లియుఁ, దండ్రియు, మిత్రుఁడు నను నీ ముగ్వురే నిజమైన హితులు. కడమవా రందఱుఁ దమ మేలు కోరిమాత్రమే హితు లగుచున్నారు. నాకు మూషిక రాజగు హిరణ్యకుఁ డను నొక మిత్రుఁడు గలఁడు. గండకీ నదీ తీరమునఁ జిత్రవనమం దాతఁడు నివసించుచుండును. ఆతఁ డీ వల గొఱికి మనలను విడిపింపఁగలఁడు" అని చెప్పఁగనే పావురములన్నియుఁ బోయి హిరణ్యకుఁడు వాసము చేయు చున్న కలుఁగుదరిని వ్రాలెను.

హిరణ్యకుఁడు పావురములకు మేలుసేయుట

హిరణ్యకుఁడు పావురములు వ్రాలిన సవ్వడి గుర్తించి భయముచేఁ దన కలుఁగులోఁ గదలక మెదలక యుండెను. అపుడు చిత్రగ్రీవుఁడు "చెలికాఁడా! మాతో మాటాడవేల?" యని యెలుఁగెత్తి పిలిచెను. ఆమాట చిత్రగ్రీవునిదని గుర్తించి వెంటనే హిరణ్యకుఁడు కలుఁగు వెలుపలికి వచ్చెను. చిత్రగ్రీవునిఁ జూచి "మిత్రునితో సంభాషణము, సహనివాసము, కలుగుట కన్న పుణ్యము మఱిలేదు. పుణ్యావశమున నాచెలికాఁడువచ్చి

నా కానందముఁ గలిగించినాఁడు.” అని పలికి వలలోఁ దగులుకొన్న పావురములను జూచి కొంచెము భయపడి 'మిత్రుఁడా! ఇదియేమి' యని యడిగెను.

దానికిఁ జిత్రగ్రీవుఁడు "మిత్రుఁడా! యిది మా పూర్వ జన్మకర్మమునకు ఫలము. రోగము, పరితాపము, బంధనము, వ్యసనము నను నవి ప్రాణుల కాత్మాపరాధవృక్షఫలములు గదా!” యని బదులు పలికెను.

వెంటనే హిరణ్యకుఁడు చిత్రగ్రీవుని బంధములు గొఱుకుటకై సిద్ధపడెను. చిత్రగ్రీవుఁడు "మిత్రమా! ఇది సరికాదు. ముందు నాయాశ్రితుల బంధములు తెగఁ గొఱుకుము. తరువాత నావియుఁ గొఱుకవచ్చును” అనెను.

ఇది విని యా మూషికరాజు "నాదంతములు కడు సున్నితములు. శక్తియుఁ దక్కువగా నున్నది. కావున ముందుగా నీ బంధములు ఛేదించి తరువాత శక్తియున్నచో వారి బంధముల సంగతి చూచెద” ననెను.

ఆ పలుకులకుఁ జిత్రగ్రీవుఁడు "సరే; శక్తికి మించి యేమి చేయఁగలవు? ముందు వీరి బంధములు శక్తియున్నంత వఱకుఁ ద్రుంపుము. పిమ్మటనే నాపని చూడవచ్చును” అన, మూషికరాజు "తన్ను వీడి యితరులఁ గాపాడఁ దలచుట నీతి గాదు. 'ఆపదవేళ నుపయోగపడుటకై ధనమును రక్షించుకొనవలయును. ధనమును వీడియైనను దారను గాపాడుకొనవలయును. ధనమును, దారను వీడియైనను తన్నుఁ దా

నేమఱక కాపాడుకొనవలయును' అని నీతివిదులు పలుకుదురు. ప్రాణములు ధర్మార్థకామమోక్షముల సుస్థితికి మూలములు. అవి పోయినచో సర్వముఁ బోయినట్లే." అని చెప్పెను.

ఆపలుకులు విని చిత్రగ్రీవుఁడు మరల నిట్లనెను. "మిత్రుఁడా! నీవు చెప్పినది నీతియే. అయినను నా యాశ్రితుల దుఃఖము నేను సహింపఁజాలను; కావున నిట్లు పలికితిని. 'పరుల నిమిత్తము ధనమునే కాక జీవితమును గూడ వదలుకొనవలయు' నని పెద్దలు చెప్పుదురు. ఎప్పుడైనను నశింపక తప్పని ప్రాణములు మంచికారణమునఁ ద్యజించుట శ్రేయస్కరము గదా! అన్నివిధముల వీరు నాకు సమానులు. వీరి నిపుడు రక్షింపలేకున్నచో వీరికి నాప్రభుత్వమువలని యుపయోగమేమి? జీతబత్తెములు లేకున్నను వీరెల్లపుడు వీడక నన్నుఁ గొలుచుచున్నారు. నాజీవితము వదలుకొనినైనను వీరిని రక్షించుట మేలు. అనిత్యము, మలినము నగు దేహముచే శాశ్వతము, నిర్మలము నగు యశము లభించు నపుడిఁకఁ గావలసినదేమి యుండును? శరీరము క్షణకాలములో నశించునది; గుణములు కల్పాంతమువఱకు నుండునవి. కావున మలినమైన నాదేహము విషయమున శ్రద్ధమాని నాకీర్తిశరీరమును గాపాడుము."

చిత్రగ్రీవుఁ డాడిన యీమాటలు విని హిరణ్యకుఁడు సంతోషముచేతఁ బులకితుఁడయి యిట్లనియెను. "సఖుఁడా మేలుమేలు. ఆశ్రితులయెడల వాత్సల్య మనెడి నీ యీ సుగు

ణముచేత ముల్లోకముల నేలఁజాలి యున్నావు. ” ఇట్లు పలికి యన్నిటిబంధములు నవలీలగాఁ గొఱికివైచి వానిని సాదరముగాఁబూజించి హిరణ్యకుఁడు కపోతరాజుతో మరలనిట్లనెను.

“ మిత్రమా ! చిత్రగ్రీవా ! వలలోఁ దగులుకొంటి నని విచారింపకుము. ఆమిషము నాకాశమున యోజనము దూరము నుండియైనఁ జూడఁగలపక్షి యాపత్కాలము ప్రాప్తమై నప్పుడు తనసమీపమునఁ బన్నఁబడిన వలను సైతముఁ జూడజాలదు. కాలము ప్రాప్తించినపుడు సూర్య చంద్రులకు రాహుకేతుగ్రహపీడయుఁ గజసర్పములకు బంధనమును, బుద్ధిమంతులకు దారిద్ర్యమును గలుగుచుండుటఁ జూచి నచో విధి బలవత్తర మని తెలును గదా ! కావునఁ గాల మతిక్రమింపరానిది ” అని యూరడించి, యాలింగన మొనరించి, సపరివారముగా నాతిథ్యమొసఁగి హిరణ్యకుఁడు చిత్రగ్రీవునిఁ బంపెను. ఆ కపోతరా జానందమున యథేచ్ఛముగా వెడలెను. హిరణ్యకుఁడు తనకలుఁగుఁ జొచ్చెను.

కాఁబట్టి పెక్కుమంది సన్మిత్రులను సంపాదింపవలయును. ఒక్క మూషికమువలనఁ బావురముల కెంతమేలు చేకూఱెనో చూడుడు !

లఘుపతనక మనెడి వాయసము హిరణ్యకుని చెలిమి గోరుట

వెంటనంటిపోయి పావురముల సంగతి యంతయుఁ జూచి లఘుపతనక మనెడి బూరుగుచెట్టుమీఁది వాయసము

హిరణ్యకుని కలుగు దగ్గర వ్రాలి "ఓహో! హిరణ్యకుఁడా! కొనియాడఁ దగినవాడవు. కాఁబట్టి నీచెలిమిగోరి వచ్చితిని. దయయుంచి నాకోరిక దీర్పుము" అని పలికెను.

హిరణ్యకుఁ డది విని కలుఁగులోనుండియే "ఓయీ నీ వెవఁడవు?" అని ప్రశ్నించెను. ఆకాకి "నేను లఘుపతనక మనెడి వాయసమను" అని బదులు పలికెను. హిరణ్యకుఁడు విడ్డూరముగా నవ్వి "నీతోడనా మైత్రి? సరిపడువారు మైత్రి చేయుట మంచిది. నే నాహారమను నీవు భక్షకుఁడవు. కావున నీతో స్నేహము నాకు హానికరము. పూర్వ మొకలేడి యొక నక్క చెప్పిన కపటపుమాటలు నమ్మి యురులలోఁ దగులు కొని యొక కాకముచేతఁ గాపాడఁబడినది. నీ కా కథ చెప్పె దను, విను" మని యిట్లు చెప్పఁదొడఁగెను.

నక్క కపటపు మాటలచే వంచింపబడిన లేడి కథ

మగధదేశమునఁ జంపావతి యను నడవియొకటి గలదు. అచటఁ జిరకాలమునుండియు నొక లేఁడియు, నొక కాకమును మిగుల స్నేహముతో నివసించుచుండెను. ఆలేడి చక్కఁగా బలిసి యడవిలో హాయిగా తిరుగుచుండఁగా నొక జంబుకము చూచి యిట్లాలోచించెను.

"ఆహా! యీలేడి మిక్కిలి బలిసియున్నది. దీని మాంసము నాకెట్లు లభించును? దీనికి నమ్మకము గలిగించి ప్రయత్నించి చూచెదను." అని తలఁచి యాజింకను సమీ

పించి "చెలికాఁడా! సేమమా?" యని యడిగెను. దాని కాజింక "నీవెవ్వఁడ" వని ప్రశ్నించెను.

"నేను సుబుద్ధియను పేరుగల జంబుకమను. కారణాంతరములచేత నాచుట్టము లందఱు నన్ను విడిచి పోయిరి. నేను మృతునివలె నిచట నొంటరిగా వసించుచున్నాను. స్నేహపాత్రుఁడవగు నిన్నుఁ జూడఁగనే బంధువులనడుమఁ జేరినటు లున్నది. నీతోఁ జెలిమిచేసి కూడియుండఁ దలఁచుచున్నాను." అని యాజంబుకము సమాధాన మీయఁగా "సరే, అట్లే కానిమ్ము." అని దానిని లేఁడి సాయంకాలము తన నివాసస్థానమునకుఁ దోడుకొనిపోయెను.

అచట సంపెంగచెట్టుకొమ్మమీఁద నిలిచియున్న కాకి తన చెలికాఁడగు జింకను జూచి "యీ రెండవవాఁ డెవ్వఁ" డని యడిగెను. "నాస్నేహముఁ గోరివచ్చిన సుబుద్ధియను జంబుకోత్తముఁ" డని లేఁడి చెప్పఁగా విని, కాక మిట్లనియెను.

"సఖుఁడా! ఆకస్మికముగా వచ్చినవారిని నమ్మి చెలిమి సేయఁదగదు. కులము, శీలము నెఱుఁగనిదే యెవ్వరికిఁ జోటీయఁ దగదు. మార్జాలమునకుఁ జోటిచ్చిన దోషముచేతఁ బూర్వము జరద్గవమను నొక గ్రద్ద మరణము నొందెను. నీ కా కథ వివరించెదను వినుము" అని కాకి యిట్లు చెప్పఁ దొడఁగెను.

మార్జాలమునకుఁ జోటిచ్చి దానివలన మరణించిన జరద్గవ మను గ్రద్ధ కథ

గంగాతీరమున గృధ్రకూట మను పర్వతమున నొక పెద్ద జువ్విచెట్టు గలదు. దాని తొఱ్ఱయందు మిక్కిలి ముదుసలియై గోళ్లు, దంతములు పట్టుచెడిన జరద్గవ మను నొక గ్రద్ద నివసించుచుండెను. ఆ చెట్టుమీఁదనుండు పక్షులు దయతోఁ దాము తెచ్చుకొన్న తిండిలోఁ గొంచెము కొంచెము మా జరద్గవమున కిచ్చుచుండెను. ఆగ్రద్ద దానితో జీవించుచుఁ బక్షులు గూళ్లు విడిచి పోయినపుడు వాని పిల్లలను గాపాడుచుండెను.

ఒకనాఁడు దీర్ఘకర్ణ మనెడి పిల్లి యొకటి పక్షిపిల్లలను బట్టుకొని తినుటకై యాజువ్విచెట్టుకడకు వచ్చెను. దానిం జూచి పక్షిపిల్లలు భయపడి యఱవఁదొడఁగెను. అంతట జరద్గవ మా యఱపు విని "యెవ రా వచ్చుచున్న వా ?" రని ప్రశ్నించెను.

అపు డాపిల్లి గ్రద్దను జూచి భయపడి "హా, చచ్చితిని! ఇఁక నేమి చేయుదును? ఆపద మీఁదఁ బడినపుడు భయపడి పొందఁగల ప్రయోజనమేమి? పాఱిపోవు టిఁక శక్యముగాదు. ఉపాయమునఁ దప్పించుకొనవలయును. ఏమైన నగును గాక. దీనితో మాటలాడి నమ్మకము గలిగింప యత్నించెదను." అని యాలోచించి దరిఁజేరి "అయ్యా! నమస్కారము" అని పలుకఁగా గ్రద్ద 'నీవెవ్వఁడ' వని ప్రశ్నించెను. "నేను

దీర్ఘకర్ణమను పేరుగల పిల్లిని” అన, గ్రద్ద “వెంటనే దూరముగఁ బొమ్ము. లేనిచోఁ జంపివేయుదు” ననెను.

“దయయుంచి నామాట వినుఁడు. అనంతరము చంపఁదగినవాఁడ నైనయెడల నన్నే చంపివేయవచ్చును. జాతిమాత్రమున నెవ్వరినిఁ జంపివేయనురాదు; పూజింపను గూడదు. సంగతియంతయుఁ దెలిసికొని చంపఁదగునో, గౌరవింపఁదగునో నిర్ణయించుట నీతి” అని యా మార్జాలము వేడుకొనఁగా గ్రద్ద యపుడు “అయినచోఁ జెప్పుము. నీవేమి పనిమీఁద నిచటికి వచ్చితివి?” అని యడిగెను.

“నే నిచట గంగలో నిత్యము స్నానముచేయుచు మాంసాహారము విడిచి బ్రహ్మచారినై చాంద్రాయణవ్రతము చేయుచుంటిని. మీరు ధర్మజ్ఞానపరులనియు, విశ్వాసయోగ్యులనియుఁ బక్షులన్నియు నెల్లవేళల నుతించుట విని, విద్యచేతను, వయస్సుచేతను బెద్దలయిన మీవలన ధర్మములు విన దలఁచి మీదర్శనమునకు వచ్చితిని. అన్ని ధర్మములుఁ దెలిసిన మీరే మీయింటికివచ్చిన నన్నుఁ జంపఁదలఁచితిరి.

ఇంటికి వచ్చినపుడు శత్రువున కయినను గౌరవము చేయవలయును. ధన మీయలేకున్న మంచిమాటలతోనైన నాదరింపవలయును. తన్ను ఛేదించుటకు వచ్చినవానికి సయితము వృక్షము చల్లని నీడనొసఁగి యాదరించుచున్నది. సాధువులు గుణహీనులయందును దయచూపుదురు. ఎట్టి

నీచపుఁ దావులయందును జందమామ వెన్నెల గాయకుండ నుండఁడుగదా !

మఱియు నగ్ని బ్రాహ్మణులకుఁ బూజ్యుఁడు. అన్ని వర్ణములవారికి నిజమైన బ్రాహ్మణుఁడు పూజ్యుఁడు. స్త్రీలకు భర్త పరమపూజ్యుఁడు. ఇంటికి వచ్చిన యతిథి యందఱకుఁ బరమపూజ్యతముఁడు. ఎవ్వఁడింటికి వచ్చిన యతిథిని, నిరాశతో వెడలఁగొట్టునో వాని సుకృత మా యతిథికిఁ జెందుననియు, నాయతిథి చేసిన పాప మాతని వెడలఁగొట్టిన వానికి వచ్చు ననియుఁ బెద్దలు చెప్పుదురు. అతిథి సర్వదేవతలతో సమానుఁడు. వాఁడెట్టి నీచుఁడైనను గౌరవమున కర్హుఁడు." అని పిల్లి చెప్పిన సంగతులు విని గ్రద్ద మరల నిట్లనెను. "పిల్లులకు మాంసమునం దెక్కువ యిష్టము. పక్షిపిల్లల రక్షణభారము నామీఁద నుండుటచేత నిట్లంటిని" అనఁగానే యాబిడాలము చెవులు మూసికొని యిట్లు పలికెను.

"హరిహరీ! ఎంతమాట వినవలసి వచ్చినది! ధర్మశాస్త్రములు విని, కోరికలు విడిచి చాంద్రాయణవ్రత మాచరించుచుంటిని. ఇతర విషయములను గుఱించి పరస్పరవిరోధము లెన్నియున్నను ధర్మశాస్త్రము లన్నియు 'అహింస పరమధర్మ' మని యేకగ్రీవముగా ఘోషించుచున్నవి. సర్వజీవులయందు దయగలిగి యుండి యహింస నవలంబించువానికి స్వర్గము స్వాధీనమై యుండును. మరణము కలుగునప్పుడు పుట్టుదుఃఖము వర్ణింపనలవికానిది. ఒకరి ప్రాణములు దీసి

తా మనుభవించు తృప్తి క్షణికమే కదా ! అనాయాసముగా దొరకు నే యాకలములతోనైనఁ బొట్టపోసికొనవచ్చును. ఈ పాడుపొట్టకై మహాపాపముచేయుట యెంత తెలివితక్కువ పని ?" యని పలికి యా ముసలిగ్రద్దకు సంపూర్ణమగు నమ్మకముఁ గలిగించి దానితో మిక్కిలి స్నేహముఁ జేయుచు నాచెట్టు తొఱ్ఱలోనే నివసించుచుండెను.

ఇట్లు కొన్నిదినములు గడచి గ్రద్దకు నమ్మకము ముదిరిన యనంతరము దీర్ఘకర్ణము చెట్టెక్కి పక్షిపిల్లలను దెచ్చి తొఱ్ఱలో నిడుకొని నిత్యము భక్షింపసాగెను. తమపిల్లలు కనఁబడక పక్షులు దుఃఖించుచు నిటునటు వెదుకఁ దొడఁగినవి. ఆ సంగతి తెలిసి పిల్లి తొఱ్ఱను విడిచి పాఱిపోయెను. పక్షులు వెదకివెదకి తొఱ్ఱలోనున్న తమపిల్లల యెముకలు కనుఁగొని యా జరద్గవమే పిల్లలను దినివైచి యుండునని నిశ్చయించి యన్నియుఁ జేరి తమ ముక్కులతోఁ బొడిచి యా ముసలి గ్రద్దను జంపివైచినవి.

కాఁబట్టి యాకస్మికముగా వచ్చినవారిని నమ్మరాదని చెప్పితిని ? ఈ విధముగాఁ జెప్పిన కాకి పలుకులు విని మిక్కిలి కోపముతో జంబుక మిట్లనెను.

" ఈ లేఁడిని జూచిన మొదటిరోజున నీవును నూతనుఁడవే. అట్టి నీకును దీనికిని మైత్రి నిత్యమును వర్ధిల్లుట లేదా ? నీ కెదురాడువారు లేక నీకుఁ దోచిన వన్నియు నీతులని పలుకు

చున్నావు. వీఁడు తనవాఁడు, వీఁడు పరుఁడు నని యల్పబుద్ధి గలవారు తలపోయుదురు. బుద్ధిమంతు లట్లు భావింపక లోక మంతయు నొకేకుటుంబమని యెంతురు. ఈ లేఁడి నీకెట్టి చుట్టమో నాకును నట్టిబంధువే." ఈ మాటలు విని 'యట్లే యగుఁ గాక' యని కాకియు దానిచెలిమి కంగీకరించెను. అప్పటినుండియు నాలేఁడియు, నక్కయుఁ, గాకియు మిక్కిలి స్నేహముగలిగి యా వనమున నివసించుచుండెను.

కొంతకాలమునకుఁ బిమ్మట సుబుద్ధి లేఁడితో రహస్య ముగా నిట్లు పలికెను. "యీ యడవియం దొక్కచోట సస్యముతో నిండిన పొలమున్నది. దానిని నీకుఁ జూపుదును ర" మ్మని జింకను వెంటఁ దీసికొనిపోయి సుబుద్ధి పంట పొలము దానికిఁ జూపెను. లేఁడియు రోజురోజు నచటికిఁ బోయి యాపయిరు దినుచుండెను.

ఒకనాఁడు పొలముకాపు పయిరు దినివేయఁబడుచుం డుటఁ జూచి, వలపన్ని వెడలెను. జింక మేఁతకుఁ బోయి యావలలోఁ జిక్కుకొని 'నన్నీ వలనుండి, తప్పించి కాపాడు దిక్కెవరు?' అని చింతించుచుండ జంబుకము వచ్చి చూచి 'నాతంత్ర మిప్పటికి నెఱవేఱినది. ఇది చంపబడినయెడల దీని మాంసాదులు చాలకాలమువఱకు నాకు భోజనమునకు సరి పోవును.' అని తలఁచుచు దరి కేఁగెను.

లేఁడి జంబుకమును గాంచినంతనే సంతసించి 'సఖుఁడా! త్వరితముగా వచ్చి నాబంధములు గొఱికి నన్నుఁ గాపాడు'

మని కోరెను. ఆ నక్కయు మఱింత దగ్గరగా వచ్చి మాటి మాటికి వలను బరిశీలించి చూచి 'మిత్రుఁడా ! యీవల నులి నరములతోఁ జేయఁబడినది. దీనిని నేఁ డాదివార మగుటచేతఁ దాఁకఁ జాలను. నీవు వేఱుగా భావింపకుము. తెల్లవారఁగనే నీవు చెప్పినట్లు చేయుదును.' అని పలికి సమీపమందలి పొద చాటున దాగియుండెను.

అనంతరము సాయంకాలమైనను లేఁడి తిరిగి రాకుండుట చేత వాయస మనుమానపడి యటునిటు వెదకుచు వచ్చి వలలోఁ దగులుకొనియున్న మిత్రునిఁ జూచి 'ఇది యేమి ?' యని యడిగెను.

'మిత్రుని మాట వినకుండుటవలనఁ గలిగిన ఫలితము. హాని సిద్ధమైయున్నపుడు సఖుల మాటలు చెవి కెక్కునా !' యని పలికి లేఁడి సంగతియంతయు వివరించెను. 'జంబుక మెచట నున్న' దని వాయస మడిగెను. 'నా మాంసముఁ దినఁ గోరుచు నిచటనే యుండు' నని మృగము బదులు పలికెను. అపుడు కాకి యిట్లనెను.

'నేను ముందే చెప్పితిని. నాయం దేమియు దోసము లేదు గదా యని దుర్మార్గులను నమ్మరాదు. వారు సుజను లకుఁ గూడ హానిచేయఁగలరు. మరణము సమీపించినవారు దీప మాఱిపోవునప్పటి గంధ మాఘ్రాణింపలేరు. మఱియు వారి కరుంధతీ నక్షత్రము గోచరింపదు. మిత్రులమాటలు చెవి కెక్కవు.

ఎదుట మంచిమాటలాడి నమ్మించి చాటునఁ గీ డొన రించు మిత్రుని నమ్మరాదు. అట్టివాఁడు మేఁకవన్నె పులివంటి వాఁడు.' అని పలికి 'ఓ దుష్టజంబుకమా! పరమసాధువయిన యీజింకను వంచించితివా? ఓ భూమాతా! నమ్మి మేలొన రించిన వారిని వంచించు దుష్టుల నెట్లు భరింపఁగలుగుచుంటివి?

దుర్జనుల సాంగత్యము సకలహానులకు మూలము. నిప్పు తాఁకినవారిని దహించును. చల్లారినను మాలిన్యమును గలిగించును.

దోమ ముందుగాఁ బాదముల మీఁద వ్రాలును. పిదప వీపుమీఁది మాంసమును గొఱుకును. చెవిలో మధురముగా నేమియో పలుకును. రంధ్రముఁ జూచుకొని నెమ్మదిగా శరీర మునఁ జేరి కడుంగడు హానిఁ గలిగించును. దుష్టుని వర్తనము నిట్టిదే. మధురముగా మాటలాడినంతమాత్రమున విషముతో నిండిన హృదయముగల దుర్జనుని నమ్మరాదు' అని విచా రించుచుండఁ గఱ్ఱ చేతఁబట్టుకొని వచ్చుచున్న పొలముకాపు గనఁబడెను.

వానిఁ జూచి వాయసము 'సఖుఁడా! ఆలసింపరాదు. ఊపిరి బిగఁబట్టి కడు పుబ్బరించునట్లు చేసి కాళ్లు చాచుకొని చనిపోయినట్లు నటింపుము. నేను కూయఁగానే లేచి వేగ ముగాఁ బాఱిపొమ్ము' అని చెప్పెను.

జింకయుఁ గాకి చెప్పిన విధమునఁ జచ్చినట్లు పడియుం డెను. అపుడు పొలముకాపువచ్చి యా జింకను జూచి యది

చచ్చినదని తలఁచి వల వదలించెను. అది చూచి కాకి కూసెను. అంతట వేగముగా లేచి లేఁడి పాఱిపోయెను. మృగముచేసిన వంచన కా ఘాలముకాపు మిక్కిలి కోపించి తన చేతనున్న బడియ విసరగా నది గుఱితప్పి దాగియున్న నక్కకుఁ దగిలెను. దానిచేత నానక్క వెంటనే ప్రాణములు విడిచెను.

"పుణ్యముగాని, పాపముగాని మితిమీఱి చేయువారికి ఫలితము కొలఁది కాలములోనే సంభవించును." అనిన విని లఘుపతనకము హిరణ్యకున కిట్లనెను.

"నిన్నుఁ జంపిన మాత్రమున నాకుఁ బుష్కలముగ నాహారము చేకూఱునా? నీతో మైత్రి యొనరించి చిత్రగ్రీవుని వలె నుండుదును. నీవెన్ని చెప్పినను నీచెలిమి సేయనిదే జీవించి యుండఁజాలను. నే నింతగా మాట్లాడితినని నాపైఁ గోపగింపకుము. సాధువులకుఁ గోపము వచ్చినను వా రితరులకు హాని చేయఁ బూనుకొనరు, నిప్పురవ్వ తగిలిన మాత్రమున సముద్ర జలము వేడి యెక్కదు."

ఈ మాట విని, "నీవు చంచలబుద్ధివి. చపలుని చెలిమి మంచిదిగాదు. మార్జాలము, దున్నపోతు, కాకము, దుర్జనుఁడు నమ్మించి యెంతపనియైనఁ జేయఁగలరు. మఱియు నీవు మాకు శత్రువుల తెగకుఁ జెందినవాఁడవు. శత్రు వెంతమంచివాఁడైనను వానితోఁ జెలిమి సేయఁదగదు. జల మెంత యుష్ణమైనదైనను నిప్పును జల్లార్పకుండునా? మంచి మాణిక్యములను

ధరించినదైనను సర్పము చేరరాని దైనట్లుగా నెట్టివిద్యగలవాఁడైనను దుర్జనుఁడు చేరనీయక విడువఁదగినవాఁడు. నేలమీఁద వానలును నీటిమీఁద బండ్లును నడువఁజాలని విధమున శత్రువు మేలొనరించుట యసంభవము. శత్రువును, దనపై మనసులేని భార్యను నమ్మియుండువాని కచిరకాలము నకే హాని సంభవింపపకమానదు" అని దృఢముగాఁ బలికెను.

ఆ మాటలు విని లఘుపతనకము "వేయిమాటలేల ? నీవు నాచెలిమి కంగీకరింపని యెడల నేఁటినుండి నిరశనవ్రతముఁబూని ప్రాణములు కోలుపోవుదును. కారణ మేమన; మంటికుండనువలె దుర్జనునిఁ ద్వరలో విడఁగొట్టుట సులభము. సంధించుట మిక్కిలి కష్టము. బంగరుకలశము త్వరితముగా సంధింపఁబడును గాని తేలికగా విడఁగొట్టఁబడదు. సుజనుని విధము నట్టిదియే.

సుజనులను జూచినంతమాత్రమున సఖ్య మేర్పడును. అది విడఁదీయరానిదై యుండును. సుజనులు నారికేళమువలె సారముఁ గలిగియున్నట్లు బయటికి గనఁబడకున్నను నంతరంగమున సుగుణసారముఁ గలిగి యుందురు. దుర్జనులు మేడిపండువలె బయటికి మాత్రము సుందరముగాఁ గనఁబడుదురు. సాధువుల చెలిమి కేకారణమున నైన నాటంకములు గలిగినను వారి గుణముల యోగ్యత సెడదు. తామరతూండ్లు త్రుంచి వేయఁబడినను వాని దారములు విడిపోవు. మంచిమిత్రుని గుణములని చెప్పఁబడు దయ, స్నేహము, త్యాగము,

శౌర్యము మున్నగునవి యన్నియు నీయందుఁ గలవు. ఇట్టి మిత్రుఁడు నాకింకెట్లు దొరకును?" అని వివరించెను.

ఆ మాటలు విని హిరణ్యకుఁడు కలుఁగు వెడలివచ్చెను. "లఘుపతనకా! నీమాట లమృతమువలె నా కానంద మొసఁగినవి. మంచిగంధపుసారముగాని, చల్లని నీటితుంపురుల జల్లుకాని, కప్పురపుఁబ్రోవుల పరిమళముగాని యాదరముతో నిండిన సుజనుల సల్లాపమువలె హాయి గలిగింపఁ జాలఁవు. రహస్యము వెల్లడించుట, యాచన, నిష్ఠురముగ మాటలాడుట, మనస్థిరత్వము లేకపోవుట, కోపము, నసత్యములాడుట మిత్రులకుండరాని గుణములు. ఈ దోసములం దేదియు నీయందు లేదు. మాటలవలననే మంచిచెడ్డలు గొంతవఱకు వెల్లడియగుచుండును. కావున నీవు గోరినటులే యగునుగాక" అని పలికి వాయసముతో సఖ్య మొనరించి గౌరవించెను. నాటినుండియు లఘుపతనక హిరణ్యకులు పరస్పరముఁ గుశల మరసికొనుచుఁ గడు విశ్వాసముతో మాటలాడుకొనుచుఁ గాలక్షేపము సేయుచుండిరి.

ఒకనాఁడు లఘుపతనకుఁడు హిరణ్యకునితో "సఖుఁడా! ఇచట నాకుఁ దిండి దొరకుట కష్టమగుచున్నది. ఇచ్చోటు వీడి మఱియొకస్థలమున కేఁగుట మంచిదని తలంచుచుంటిని." అని చెప్పెను. దానికి హిరణ్యకుఁడు 'మిత్రుఁడా! ఒకస్థానము విడిచి నూతనస్థలమున నడుగిడునపుడు చక్కఁగా నాలోచింపవలయును. నీవెచటి కేఁగఁ దలఁచితివి?' అని యడిగెను.

"మిత్రమా! చక్కగా నాలోచించితిని. దండకారణ్యమునఁ గర్పూరగౌర మను నొక సరస్సు గలదు. చిరమిత్రుఁడైన మంథరుఁ డనెడి కూర్మరాజందుఁ గలఁడు. ఇతరులకు ధర్మములు బోధించుట సులభము. ఆచరించుట కష్టము. ఆ తాఁబేలు కడు ధర్మాత్ముఁడు. ఆతఁ డాహార మొసఁగి నన్నుఁ బోషింపఁగలఁడు" అని వాయసము బదులుపల్కెను.

అంతట హిరణ్యకుఁడు "నీవు వెడలిపోయిన తర్వాత నిచటనుండి నేనేమి చేయుదును? 'ఏ దేశమున గౌరవము, జీవనోపాయము, చుట్టములు, విద్యాప్రాప్తి లభింపవో యా దేశము విడువవలయు' నని పెద్ద లందురు. మఱియు, అప్పిచ్చువాఁడు, వైద్యుఁడు, సంతతముఁ బ్రవహించు నది, వేదపండితుఁడు లేనిచోట నుండరాదు. కావున నన్నుఁగూడ నీతోఁ గొనిపొమ్ము." అని కోరెను. లఘుపతనకుఁ డందుల కంగీకరించెను. సంతసముతో విచిత్రమైన కథలు చెప్పుకొనుచుఁ గర్పూరగౌర సరస్సును జేరఁబోయిరి.

మంథరుఁడును, వచ్చుచున్న వాయస మూషికములను దూరమునుండియే చూచి తగిన విధమున నాదరించెను. అనంతరము లఘుపతనకుఁడు మంథరునితో నిట్లు పలికెను. "సఖుఁడా! యీ మూషికరాజు మిక్కిలి పుణ్యాత్ముఁడు. దయాపరుఁడు. ఈతని పేరు హిరణ్యకుఁడు. ఈతని సుగుణ విశేషము లాదిశేషుఁడైనను వర్ణింపఁజాలఁడు. ఈతని నీవు

మిగుల గౌరవింపవలయును." అని హిరణ్యకునితోడి తన చెలిమిని గుఱించి వివరించెను.

అంతట మంథరుఁడు హిరణ్యకుని మిక్కిలి పూజించి "హిరణ్యకా! నీ వీ జనరహితమైన యడవియందేల నివసించు చుంటివి" వని యడిగెను. అపుడు హిరణ్యకుఁడు తన వృత్తాంతము నిట్లు చెప్పఁదొడఁగెను.

"చంపక మను నగర మొక్కటి కలదు. అందలి మఠములో సన్యాసులు పెక్కుమంది నివసించుచుందురు. అందుఁ జూడాకర్ణుఁ డను నొక యతి గలఁడు. అతఁడు ప్రతి దినముఁ దాను భుజింపఁగా మిగిలిన యాహారము భిక్షాపాత్రమందుంచి యా పాత్రముఁ జిలుకకొయ్యకుఁ దగిలించి నిదురించుచుండువాఁడు. నేను రోజురోజు మెల్లగాఁ బయి కెగఁబ్రాఁకి యా పదార్థమును దినిపోవుచుండువాఁడను. ఒకనాఁ డాతని మిత్రుఁడు వీణాకర్ణుఁ డచటికివచ్చెను. జూడాకర్ణుఁ డాతనితో మాటలాడుచు నన్ను భయపెట్టుటకై మాటిమాటికి గిలుక కఱ్ఱతో నేల మీఁదఁ గొట్టుచు వచ్చెను. అదిచూచి వీణాకర్ణుఁడు 'ఏల యటులు గొట్టుచుంటివి? నామాటలయం దిష్టములేదా?' యని చూడాకర్ణు నడిగెను.

"ఇష్టము లేకపోవుట గాదు, చూడుము, ఆ యెలుక ప్రతిదినము నా కపకారియై పాత్రమునందలి పదార్థముఁ దిని వేయుచున్నది. దానిని బెదరించుటకై యిట్లుకొట్టుచుంటిని." అని చూడాకర్ణుఁడు బదులు పలికెను. అదివిని "యల్పజంతు

వైన యెలుక కింత పైకెగురు శక్తి యెటులు వచ్చెను? దీని కేదో కారణ ముండితీరును. వెనుక శాండిలీమాతయను నొక బ్రాహ్మణి నువ్వుపప్పునకు మాఱుగా నువ్వు లడిగినందుల కేదో కారణ ముండియుండునని యొక బ్రాహ్మణుఁడు గుర్తించెను. నీ కా కథ చెప్పెదను వినుము" అని వీణాకర్ణుఁ డిట్లు చెప్పఁదొడఁగెను.

నూవుల బ్రాహ్మణి కథ

"పూర్వము నే నొక బ్రాహ్మణుని యింటికి భిక్షకై వెడలి యుంటిని. ఆయింటి బ్రాహ్మణుఁడు "రేపటి దిన మమావాస్య. బ్రాహ్మణులకు భోజనము పెట్టవలసియున్నది. పదార్థము లేవి సమకూర్చియుంటి" వని భార్య నడిగెను.

"పురుషులు తమ సామర్థ్యముచేతఁ బదార్థములు సంపాదించి యింటికిఁ దేవలయును. అపుడు స్త్రీలు గావలసిన పనులకు వాని నుపయోగింతురు. మీరు తేకుండిన నే నేమి చేయఁగలను?" అని యామె బదులు పలికెను.

దాని కా బ్రాహ్మణుఁడు కోపగించి "పదార్థములు సంపాదింప వలయునన్నమాట నిజమేకాని బ్రాహ్మణునకు విస్తారముగా సంపాదింపవలయు ననెడి కోరిక యుండరాదు. అట్లని విధాయక కృత్యముల కత్యావసర మైనవానిని భద్రపఱుపక పోవుట తప్పుకాదా?" యని భార్యను మందలించెను.

అపు డామె భర్తతో "నువ్వులు, బియ్యముఁ గొంచెము కూడఁబెట్టి యుంచితిని. రేపు తిలాన్నముఁ జేయుదును రెండు" అని చెప్పి నువ్వులు బాగుగాఁ గడిగి యెండఁ బోసెను. ఒక కోడివచ్చి యానువ్వులు కాళ్ళతోఁ జిమ్మెను. బ్రాహ్మణుఁ డది చూచి బ్రాహ్మణ భోజనమున కీనువ్వులు పనికిరావు. కాఁబట్టి యవి తీసికొనిపోయి మార్చి తీసికొని రమ్మని భార్యకుఁ జెప్పెను. తరువాత నామె నేను భిక్షు కేఁగిన యింటికి వచ్చి 'నువ్వు పప్పుఁ దీసికొని నువ్వు లిచ్చెదరా?' యని యా యింటివారి నడిగెను. ఆ యింటి యిల్లాలా మాటలు విని సంతసించి యింటిలోనుండి నువ్వులు తీసికొని వచ్చి నువ్వుపప్పు పుచ్చుకొనుచున్న సమయమున నాయింటి బ్రాహ్మణుఁ డెచటి నుండియో యింటికివచ్చెను. "భార్యను జూచి నీవేమి బేరమాడుచున్నావని ప్రశ్నించెను. ఆమె చెప్పిన సంగతి విని "వెఱ్ఱిదానా? చేరుడు నువ్వులు దీసికొని దంచిననువ్వు లిచ్చువా రెక్కడనైన నుందురా? ఈమె యిట్లు వచ్చుట కేదో కారణ ముండితీరును." అని యా బ్రాహ్మణుఁడు చెప్పుచుండఁగా భిక్షార్థ మచటనున్న నే నామాటలు వినియుంటిని. ఈ మూషికమును దగిన కారణములేనిదే యిచట నింతధైర్యముగాఁ గాపురముండదు."

ఇట్లు వీణాకర్ణుఁడు చెప్పిన కథ విని వెంటనే చూడాకర్ణుఁ డొక గునపముఁ దెచ్చి నేను నివసించు కలుఁగును ద్రవ్వి చిరకాలమునుండి సంపాదించిన నా ధనమునంతను దీసి

వైచెను. నాఁటినుండి యుత్సాహ మంతయుఁ బోయి యాహార మైనను సంపాదించుకొను శక్తిలేనివాఁడనై దిగులుపడి మెల్ల మెల్లగాఁ దిరుగుచుంటిని.

చూడాకర్ణుఁ డట్టియవస్థలో నొకనాఁడు నన్నుఁ జూచి తన మిత్రునితో నిట్లనెను. "లోకమున ధనము గలవాఁడే బలవంతుఁడు. పండితుఁడు నాతఁడే. గ్రీష్మకాలమున నదు లింకిపోయినట్లు ధనములేనివాఁడు చేయఁదలపెట్టు కార్యము లన్నియుఁ జెడిపోవును. ధనముగలవారికే బంధువులు, మిత్రులు నిలిచియుండుదురు. బిడ్డలులేని యిల్లును, చుట్టములులేని దేశము, మూర్ఖుని మనస్సు శూన్యముగా నుండును. దరిద్రు నకు సర్వము శూన్యముగ నుండును. దారిద్ర్యముకంటెఁ జావు మేలు. మరణము తత్కాలమున మాత్రమే బాధ గలి గించును. దారిద్ర్యము బ్రదికియున్నంతకాలము బాధించు చుండును. అన్నిలక్షణములును వెనుకటివలెనే యున్నను ధనము తొలఁగినంతనే వేఱుమనుజునివలె నయిపోవును. ఈ సంగతి యెంతయుఁ జిత్రమయినది. ధనముఁ గోలుపోయి యీయెలుక యెంత నిరుత్సాహ మొందినదియో చూడుము."

అది విని నే నిట్లాలోచించితిని. "ఇంక నే నిచట నుండుట దగదు. ఈ వృత్తాంత మెవ్వరికిఁ జెప్పను దగదు. 'ధననాశము, మనోవ్యథ, యింటిగుట్టు, మోసము, పరా భవము నెవ్వరికిఁ జెప్పరాని' వని పెద్ద లందురు. దైవము మిక్కిలి ప్రతికూలమై పౌరుషము చెడిపోయినపు డభిమానము

గలవానికి వనమే శరణ్యము. అభిమానవంతుఁడు మరణమైన నొందును గాని దైన్యము నొందఁడు. నిప్పు, నీరు చిలుకరించినను వెంటనే వేడిమి గోలుపోవదుగదా! మానవంతుఁడు పూలగుత్తివలె నందఱి శిరముల మీఁదనైన నుండవలయును. లేదా అడవిలో మంటియందుఁబడి నశించిపోవనైనఁ బోవలయును. ఇచటనే యుండి యాచించుకొని బ్రదుకుట కంటె నెండైనఁబడి చచ్చుట మేలు.

దారిద్ర్యము సర్వాపదలకు మూలము. కల్లలాడుట కంటె మౌనము మేలు. పరసతులఁ గూడుటకంటెఁ బురుషుఁడై పుట్టకుండుట మేలు. యాచించి జీవించుటకంటెఁ జావు మేలు. దుష్టవృషభము లుండుటకంటె గోశాల శూన్యమై యుండుట లెస్స. అవినీతురాలైన భార్యకంటె వేశ్య మేలు. అవివేకి పరిపాలనమున నుండుటకంటె వనవాసము మేలు. అధములఁ జేరుటకంటె మరణమే మేలు.

వెన్నెల చీకటిని హరించును. ముదుసలితనము లావణ్యమును హరించును. హరినామము పాపములను హరించును. యాచన సర్వసుగుణములను హరించివేయును. కావున నే నేల జీవనమునకై యితరులను గాచుకొని యుండవలయును. అట్లుండుటన్న మాఱురూపమున మృత్యువు నొందియుండుటయే." అని యెంతో యాలోచించియుఁ దిరిగి లోభమునకు లొంగినవాఁడనై ధనము సంపాదింపఁ దలఁచి మరలఁ గలుఁగు నిర్మించుకొంటిని.

లోభ మెంతపాడుగుణము ? దానివలన మతి చలించును. దాన దుఃఖము గలుగును. నే నట్లు మెల మెల్లనఁ దిరుగుచుండఁగాఁ జూడాకర్ణుఁడు చూచి యీమాఱు నన్నుఁగఱ్ఱతోఁ గట్టిగాఁ గొట్టెను.

"ఎవనిమానసమునకు సంతుష్టి కలుగదో వానికి సర్వాపదలును సంభవించును. తృప్తిగలవానికి సకల సంపదలు నున్నట్లే యుండును. చెప్పులుదొడిగిన కాళ్ళకు లోకమంతయుఁ జర్మమయముగఁ దోఁచును. సంతుష్టుఁడైన వానికిఁ గలుగు సుఖ మెంతధనమున్నవానికిఁ గలుగనేరదు. తృప్తిగలవానికి సర్వము నొడగూడును ? తృష్ణకు వశుఁడైనవాఁడు దూర మనుకొనక నూఱుయోజనములైనఁ దిరుగును. సంతుష్టుఁడు ధనము మోకాలిదగ్గఱికి వచ్చినను లెక్కసేయఁడు. వనములో ఫలమూలాదులు దిని సెలయేటినీరు ద్రావి తృణశయ్యపై బరుండి బ్రదుకుట మేలగునుగాని ధనహీనుఁడై బంధుమిత్రాదుల నడుమ నుండఁదగదు." అని యెంచి యాస్థల మంతటితో విడిచి నిర్జనవనముం జేరితిని. పుణ్యవశమునఁ గొంతకాలమున కిట్టి మిత్రుఁడు లభించెను. నాయదృష్టమువలనఁ జివరికి నీయాశ్రయ మనెడి స్వర్గమే లభించినది. సంసార మనెడి విషవృక్షమునకుఁ గావ్యామృత రస మనుభవించుట, సుజనులతో సాంగత్యముచేయుట యనునవి రెండే రసవంతములయిన ఫలములు." అని హిరణ్యకుఁడు వివరించిన సంగతులన్నియు విని మంథరుఁ డిట్లుపలికెను.

"అర్థములు నిలుకడ గలవికావు. యౌవనము సెలయేటి నీటివంటిది. జీవితము నీటిబుడగవంటిది. తగినకాలమున ధర్మ మాచరింపనివాఁడు వార్ధక్యమొంది పశ్చాత్తాప మనెడి యగ్నిచే దహింపఁబడును. నీ వతి సంపాదనముఁ జేసితివి. అందుచేతనే బాధకలిగినది. తటాకజలముపొంగి గట్లు త్రెంచి వేయకుండుటకు జలమును విడుచు తూఱ యవసరమైనట్లు సంపాదింపఁబడిన ధనమునకు దానమనెడి రక్షణ మావశ్యకము. ధనము పాతఱలో దాచుట దాని నాశమునకు దారి చూపుటయే.

తన సుఖము లెక్కింపక ధనము సంపాదించువాఁడు పరులబరువు మోయువానివలె శ్రమకుమాత్రమే పాలగును. దానభోగములే ధనమునకు ఫలములు. అవిలేని ధనికుఁడు దరిద్రునికంటె నధికుఁడుగాఁడు ధనమున్నను సుఖముగా ననుభవింపనివాఁడు దరిద్రునితో సమానుఁడే. సంపాదించుట యందును రక్షించుటయందును శ్రమ మాత్ర మాతనికి విశేషము. మంచిమాటలతోడి దానము, గర్వములేని జ్ఞానము, నోర్పుతోడి పౌరుషముఁ బ్రశస్తములు. ధనసంపాదన మవసరమే యైనను దానియం దతివాంఛ దగదు. పూర్వ మొకనక్క యెక్కువ సంపాదింపఁగోరి వింటి దెబ్బచే మరణించెను. నీ కా కథ చెప్పుదును వినుము.

అతి సంపాదనేచ్ఛచే వింటిదెబ్బతగిలి మరణించిన నక్కకథ

కల్యాణకటకమను పట్టణమున భైరవుఁ డనెడి బోయ వాఁడు గలఁడు. వాఁ డొకనాఁడు వేటకై యడవి కేఁగెను.

అచట నొక మృగమును వేటాడి చంపి దానిని బుజముపై మోచికొని వచ్చుచుండఁగా నొక యడవిపంది యాతనికిఁ గనఁబడెను.

ఆతఁడు బుజము మీఁది లేఁడిని క్రిందికిఁ దించి వెల్లెక్కువెట్టి బాణము సంధించి యా వరాహముం గొట్టెను. అదియు మిక్కిలి కోపముతో ఘుర్ఘురధ్వని చేయుచుఁ గొమ్మున వానిం గొట్టఁగా నాదెబ్బ కాతఁడు మొదలు నఱకిన చెట్టువలె నేలమీఁదఁ గూలి ప్రాణములు విడిచెను. బాణపు దెబ్బచేత నడవిపందియు మరణించెను. అచ్చట నొక సర్పము కిరాత సూకరముల కాలి త్రొక్కుడికి నలిగి చచ్చెను.

ఇంతలో దీర్ఘరావ మను నొకనక్క యాయడవియం దాహారమునకై తిరుగుచు నచటికివచ్చి చచ్చిపడియున్న బోయ వానిని, సర్పమును, వరాహమును జూచి యిట్లాలోచించెను.

“నాకిపుడు గొప్పయాహారము దొరకినది. ప్రాణులకు దుఃఖము లేవిధముగా ననుకొననిదే కలుగుచుండునో దైవవశ మున సుఖములును నట్లే సంభవించుచుండును. నా కీయాహా రము మూఁడునెలలవఱకును సరిపడును. ఈ కిరాతునిమాంస మొక నెలకుఁ జాలును. లేడిమాంసముతో నింకొక నెలయుఁ బంది మాంసముతో మఱియొకమాసమును గడుపవచ్చును. సర్పమాంస మొక్కరోజునకుఁ జాలును. ఈవింటినారి నరము దిని మొదటియాకలి దీర్చుకొందునుగాక” యని తలఁచి

యావింటి చేరువకుఁ బోయి నారి గొఱుకఁగనే బెట్టువదలి వింటికొన గాటముగ బొమ్మునఁ దగిలి ప్రాణములు దీసెను.

అతిలోభ మెంత హానికరమో చూడుము. దానమునకు భోగమునకు వినియోగపడినది మాత్రమే స్వధనము. అట్లుప యోగింపక కూడఁబెట్టినది యితరులపా లగును. గతించిన దానికి విచారమేల? పండితులు రానిదానికై ప్రాకులాడరు; పోయినదానికి విచారింపరు. ఆపదవచ్చినను గలఁత నొందరు. కావున నీవెప్పుడు నుత్సాహముఁ గోలుపోవకుము. శాస్త్రము లెన్ని చదివినను క్రియాశూన్యునిఁ బండితుఁ డనుట చెల్లదు. ఔషధమెంతమంచి మందైనను పేరుచెప్పినంతమాత్రాన రోగు లకు సుఖమొసఁగదు గదా! ఉత్సాహములేనివానికిఁ బాండి త్యము గ్రుడ్డివానికిఁ దనచేతియందలి దివ్వియవలె నిరుప యోగము. కావున నోరిమి వహింపుము. పరస్థలమునకు వచ్చితినని చింతింపకుము.

రాజు, కులస్త్రీ, మంత్రులు, దంతములు, కేశములు, నఖములు, నరులు స్థానభ్రష్టులైన శోభింప రను వాక్యము కాపురుషుల విషయమున మాత్రమే వర్తించును. సింహ ములు, సత్పురుషులు, గజములు, సర్వదేశములందు సంచ రించి కీర్తినొందుట లేదా? మఱియుఁ గాకములు, మృగ ములు, కాపురుషులు స్థానమునుండి కదలఁజాలక యచటనే నశింతురు. అభిమానధనుఁడగు వీరునకుఁ దనదేశమనియుఁ బరదేశమనియు భేదములేదు. ఎచటికేఁగిన నచటనే తనసామ

ర్థ్యముచేత ఖ్యాతిఁగాంచును. నిండిన చెఱువును మండూకములు సేరినట్లు సర్వసంపదలు నుత్సాహవంతుఁడగు పురుషునిఁ బొందును.

దేహికి సుఖదుఃఖములు కాలక్రమమున సంభవించుట సహజము. సంపదగలిగినపుడు గర్వము, నాపద గలిగినపుడు ఖేదముఁ దగవు. ధనములేకున్నను వీరుఁడు గౌరవము సంపాదింపఁగలఁడు. ఎంతధనమున్నను నీచునకు గౌరవ మించుకయైనఁ గలుగదు. కుక్కకు బంగరునగ లెన్నితొడిగినను సింహమునకుండు సహజతేజస్సు గలుగదు గదా! మేఘముల చాయయు, ఖలుల ప్రీతియు, యౌవనము, ధనముఁ గొలఁది కాలముమాత్రము నిలిచియుండును. పుట్టించినప్రాణు లందఱకు నాహారము దేవుఁడే యేర్పఱుపక మానఁడు. కాఁబట్టి యాహారమునకై యంతప్రయాసపడ నక్కఱలేదు. ధనము లేవిధమునఁ జూచినను దుఃఖ కారణములే యగుచున్నవి. ముందు ముందు సంపాదించుట కష్టము. పిదప దానివలనఁ గలుగు గర్వము కలిగించు దుఃఖము లనంతములు. సంపాదించిన ధనములకు హాని గలిగిన నెట్టిదుఃఖము గలుగునదియు వర్ణింపఁ జాలము.

ధర్మకార్యములపేరు చెప్పి ధనము సంపాదించుటయు ననవసరము. అడుసు ద్రొక్కనేల? కాలుకడుగనేల? ఆకసమునఁ బక్షులచేతను, నేలమీఁదఁ బులులచేతను, జలములందు మకరములచేతను నామిషము భక్షింపఁ బడుచుండును. ధనికు

నందఱు నన్నివిధముల వేధించుకొని తినుచుండుదురు. దేహిని మృత్యువు బెదరించునట్లు, రాజు, జలము, నగ్ని, స్వజనులు ధనికు నెల్లపుడును బాధించుచుందురు. ధన సంపాదనమే కష్టము. ఆర్జించిన దానిం గాపాడుకొనుట మఱియుఁ గష్టము. దానికి హాని గలిగెనా మృత్యుబాధ గలుగును. కావున దానిపై నాశవీడుట మేలు. తృష్ణ ప్రసరించినవాని శిరముపై దాస్యము తాండవించుచుండును. అది పీడిననాఁడు ధనికుఁడనియు, దరిద్రుఁడనియు భేదభావము గలుగదు. నెఱవేఱుచున్న కోలఁదియుఁ గోరికల కంతమే యుండదు. కావున నిచ్చట నుండి కాలము గడపుము." ఈవిధముగాఁ బలికిన మంథరుని మాటలు విని లఘుపతనకుఁ డిట్లనెను.

"మంథరా! ధన్యుఁడ నైతిని. నీగుణములు కొనియాడదగినవి. బురదలో దిగఁబడిన యేనుగులను లేవనెత్తుట కేనుఁగులే సమర్థము లయినట్లు సత్పురుషుల కాపద గలిగినపుడు సన్మిత్రులే దానినిఁ దొలఁగింపఁగలరు. మహాత్ముల స్నేహము లామరణాంతములు; కోపములు క్షణికములు; త్యాగములు జంకులేనివి. యాచకుని, శరణాగతుని, నెవరు నిరాశతో వెడలింపరో వారే సకలగుణములకు నాలవాల మగుదురు."

చిత్రాంగుని చేరిక

అనంతరము మంథరాదులు ముప్పురును హాయిగాఁ గాలక్షేపము సేయుచుండిరి. ఇట్లుండగా నొకనాఁడు చిత్రాంగుఁ

డనెడి లేడి యొక వేటకానిచేఁ దఱుమఁబడి యచటికిఁ బరువెత్తు కొని వచ్చెను. అదిచూచి భయపడి మంథరుఁడు జలములోఁ బ్రవేశించెను. మూషికము కలుగులోనికిఁ బాఱిపోయెను. వాయసము చెట్టుమీఁది కెగిరి నలువైపులు చాలదూరము పరికించి భయమునకుఁ గారణమేమియులేదని తెలిసికొని మంథర హిరణ్యకులకుఁ దెలిపెను. మరల ముగ్గురుఁ గూడుకొనిరి. అపుడు వణఁకుచు నచటనున్న మృగముం జూచి మంథరుఁడు "నీ వెవఁడవు? ఏల యిచటికిఁ బాఱి వచ్చితివి?" అని యడుగఁగా, "వేటకాఁ డొకఁడు తఱుముచుండఁగా భయపడి తప్పించుకొని వచ్చి మీ శరణముఁ జొచ్చితిని. మీ చెలిమి గోరుచుంటిని." అని యా హరిణము బదులు పలికెను.

అపుడు హిరణ్యకుఁడు "మిత్రమా! స్వాగతము. స్వేచ్ఛముగా మాతోఁబాటు స్వగృహమునందువలెనే సంచ రింపుము" అని పలికి, యది యాహారపానీయములు దీసి కొని నెమ్మదించిన తర్వాత "సఖుఁడా! నిర్జనమైన యీ వనమున నిన్నెవరు తఱుముకొని వచ్చిరి? వేటకాం డ్రెవరైన నపుడపు డచట సంచరింతురా?" యని యడిగెను.

దానికి మృగ మిట్లు చెప్పెను. "కళింగదేశమున రుక్మాంగదుఁ డనుఁరాజు గలఁడు. ఆతఁడు దిగ్విజయమును గోరి వచ్చి చంద్రభాగానదీతీరమున సేనలను విడియించెను. ప్రాతఃకాలమున నాతఁడు కర్పూరసరస్సునొద్దకు రాఁగలఁడని

వదంతి వినఁబడుచున్నది. ప్రాతఃకాలమున నిఁక నిట నుండుట మంచిదిగాదు. ఏమిచేయఁదగునో యాలోచింపుఁడు.”

లేఁడి మాటలు విని మంథరుఁడు భయపడి మఱియొక చెఱువునకుఁ బోవుద మని పలికెను. కాకియు, మృగమును ‘సరే’ యనెను. వారి మాటలు విని హిరణ్యకుఁడు నవ్వి “మఱియొక జలాశయమునకుఁ బోయినయెడలఁ గుశల మని మంథరుఁడు చెప్పినది సత్యమే. కాని మెట్టదారిఁ బయనము సేయుట ప్రమాదకరము గాదా? జలజంతువులకు నీరును, దుర్గనివాసులకు దుర్గమును, శ్వాపదాదులకు స్వస్థలమును, రాజునకు సన్మంత్రియు బలము గదా? దూరాలోచనలేని కార్యమునకుఁ బూనుకొన్నయెడలఁ బిమ్మట విచారింపవలసి వచ్చును. ఈ యర్థమును దెలుపు కథ యొకటి గలదు. వినిపించెదను. వినుఁడు” అని యిటు లా కథ చెప్పఁదొడఁగెను.

దూరాలోచన లేక ముంగిసను జంపి విచారించిన బ్రాహ్మణుని కథ

గౌడదేశమునం దొక యగ్రహారమున దేవశర్మ యను బ్రాహ్మణుఁడు గలఁడు. ఆతని భార్య యజ్ఞసేన. సంతానము లేకలేక కొంతకాలమున కామె గర్భవతి యయ్యెను. దానికాబ్రాహ్మణుఁడు మిగుల సంతోషించి కోరిక లీరికలెత్తగా “ఓప్రియురాలా! నీగర్భమునందున్న కుమారుఁడు మన కులమెల్ల నుద్ధరింపఁగలఁడు. మహాభాగ్యవంతుఁడు కాఁగలఁడు.”

అని పలుకఁగా విని యజ్ఞసేన, "నాథా యిటువంటికోరికలు గోరుట మంచిదిగాదు. అనాగతకార్యములను గుఱించి యెవఁడు చింతచేయునో వాఁడు సోమశర్మ తండ్రివలె విషాదము నొందును. మీకాకథ దెలుపుదు వినుఁడు.

సోమశర్మ తండ్రి కథ

ఒకానొక బ్రాహ్మణకుమారుఁడు విద్యాభ్యాసము చేయుచు నొక బ్రాహ్మణుని యింటఁ దద్దినపు భోజనముచేసి వచ్చుచుండెను. ఆతనికి వారు కొంత పేలాలపిండి యొసఁగిరి. ఆతఁ డది యొక కుండలో నుంచుకొని తనయొద్దఁ బెట్టుకొని భుక్తాయాసము దీఱుటకై యొక యరుగుమీఁదఁ బండుకొని నిదురవోయెను. అపుడు మితిలేని కోరిక లాతని మనసునఁ గలుఁగ జొచ్చెను.

"ఇపుడు నాదగ్గఱఁ బేలాలపిండి యున్నదిగదా! నేను దీనిని విక్రయించి యొక పాడిమేకను గొనియెదను. దానికి రెండు పిల్లలు గలుగును. ఆ రెండును గొంతకాలమునకు రెండేసి పిల్లల నీనును. ఆ నాలుగింటికి నెనిమిది పిల్లలు పుట్టును. ఈ విధముగాఁ గొంతకాలమునకు వేలకొలఁదియు మేఁక లగును. తరువాత వాని నమ్మి నూఱావులఁ గొందును. అవి ప్రతి సంవత్సరము నీనుచుండును. కొన్ని సంవత్సరములకు వేలకొలఁది సంఖ్యగల యావులతోను, బెయ్యలతోను, కోడెల తోను దొడ్డి నిండియుండును. కొన్ని కోడెల నరకలు గట్టించి

దున్నించి విస్తారమయిన పంట పండించి యాధాన్యముల నమ్మి వేయుచుందును. కొన్ని కోడెలను విక్రయించి మఱికొంత ధనము సంపాదింతును.

ఈప్రకారముగా సంపాదించిన ధనముం జూచి 'నీకుఁ గన్యనిచ్చెద' మని యనేకులు వచ్చెదరు. వారిలోఁ గులంబును రూపంబును, గుణమును గలిగిన కన్య నెంచికొని పెండ్లియాడి యామెతో సంసారము చేయఁగా నొకకుమారుఁడు పుట్టును. ఆబాలునకు సోమశర్మయని పేరువెట్టుదును. కొన్ని నెలలయిన తరువాత వానికి బంగరు మువ్వలమొలత్రాడు, రావిరేక మురుగులు, గొలుసులు, అందెలు మొదలయిన నగలుపెట్టి యాదరముతోఁ జూచెదను. వాఁడాడుకొనుచు నల్లరిచేయు సమయమున నేను పనితొందరలోనుండి పిల్లవానిం దీయుమని నాభార్యను. బిలిచెదను ఆమెయు నేదోపనిలోనుండుట వలన నాలస్యము గావచ్చును. ఆలస్య మైనందులకుఁ గోపగించి యామె నీకఱ్ఱతోఁ గొట్టెదను" అని యాలోచించుచుఁ బేల పిండి తినుటకుఁ గుక్కలు మొదలగునవి రాకుండ బెదరించుటకు దగ్గఱనుంచుకొన్న కఱ్ఱగిరగిరఁ ద్రిప్పికొట్టెను. ఆదెబ్బతగిలి పేలపిండి యున్నకుండ పగిలిపోయి పిండియంతయుఁ జెదరి మంటిపాలయి పోయెను. దానితో మెలఁకువవచ్చి, జరిగినది తెలిసికొని యాబ్రాహ్మణ కుమారుఁడు మిక్కిలి విషాదము నొందెను. కాఁబట్టి యనాగతకార్యముల గుఱించి చింతింప

రా దంటిని" అని చెప్పిన భార్యమాటలు విని దేవశర్మ కొంచెము సిగ్గుపడియూరకుండెను.

తరువాతఁ గొన్ని దినములకు యజ్ఞసేన శుభలక్షణములతోఁ గూడిన కుమారునిఁ గనెను. కొన్నాళ్ళయినపిమ్మట నొకనాఁడు పర్వదినమగుటచేత నామె కుమారునిఁ బెనిమిటి కప్పగించి నదికి స్నానమునకుఁ బోయెను. ఆమెనది కేఁగిన వెంటనే యాదేశము నేలు రాజా యగ్రహారమందలి బ్రాహ్మణులను దాన మిచ్చుటకై పిలువనంపెను. బ్రాహ్మణులు కొందఱపుడు దానము గ్రహించుటకై వెళ్ళుచుండిరి.

వారిం జూచి దేవశర్మ యిట్లు చింతించెను. "అయ్యో! నేఁడు నాభార్యను స్నానమున కెందుల కంపితిని ? నేను రాజదర్శనమునకుఁ బోయినచో నిపు డీ శిశువు నెవ్వరు గాపాడుదురు? 'రాజు నన్నెపుడు పిలుచును? ఎపుడు దాన మిచ్చును? ఎపుడు భాగ్యవంతుఁడ నగుదును?' అని చిరకాలమునుండి నిరీక్షించుచుంటిని. ఇపు డవకాశమురాఁగా వెడలుటకు వీలు లేక పోవుచున్నదే!" ఇట్లు విచారించి యించుక సేపాలోచించి, చాలకాలము నుండి బిడ్డనువలెఁ బెంచిన ముంగిసను బాలునియొద్దఁ గావలియుంచెదనని నిశ్చయించి దానినిఁ బిలిచి 'నీ విచటనుండి యీ శిశువును గనిపెట్టుచుండు' మని సంజ్ఞాపూర్వకముగాఁ దెలిపి, దానిని ద్వారమందు నిలిపి రాజభవనమునకుఁ బోయెను.

బ్రాహ్మణుఁ డట్లు వెడలిన తరువాత నొక నల్లత్రాచు శిశువు చెంతకుఁ బ్రాకిపోవుచుండెను. ముంగిస యదిచూచి సర్పమునెడఁబట్టి కొఱికి చంపివైచి దానిశరీరమును ముక్కలు ముక్కలుగాఁ జేసివైచెను. నోటినిండఁ, దన దేహమునిండఁ బాము రక్త మెఱ్ఱగా నిగనిగలాడుచుండగా నాముంగి మరల ద్వారము నొద్దకు వచ్చి నిలిచెను.

అచట నా దేవశర్మ రాజొసఁగిన విలువైన దానముఁ బుచ్చుకొని బిడ్డ యేమయ్యెనో యని తలఁచుకొనుచు మిక్కిలి త్వరితముగా నింటికి వచ్చెను. వచ్చియు రాఁగానే నెత్తుటితో నిండియున్న ముంగి తన విధిని జయప్రదముగా నెఱవేర్చితి నన్న గర్వముతో యజమానుని పాదముల కడకుఁ బరుగిడెను. ఊయలలోను, దాని శరీరమునను గల రక్తము కంటఁబడఁ గానే యాముంగిస దన బిడ్డను గొఱికివైచినదని యెంచి యా బ్రాహ్మణుఁడు కోప మాపుకొనలేక యచటనున్న రోకటితో గొట్టి దానిం జంపివైచెను. అనంతర మాతఁ డూయెలదగ్గఱకు బోయి సంతసముతోఁ గాలుసేతు లాడించుచు నవ్వుచున్న తనబిడ్డను గనుఁగొనెను. ప్రక్కను తునుకలుగాఁ జేయబడి యున్న సర్పమును గాంచెను. వెంటనే జరిగిన సంగతి గ్రహించి గుండెలు బాదుకొనుచు 'మందబుద్ధినగు నేను బాగుగా నాలో చింపక తొందరపడి దారుణము గావించితి' నని విలపించు చుండెను. ఇంతలో యజ్ఞసేన స్నానము చేసివచ్చి జరిగినది

తెలిసికొని విచారించెను. కావున నేపనియు దూరమాలోచింపక చేయరాదు.''

హిరణ్యకుఁ డీవిధముగా నెంతచెప్పినను వినక భయము చేత మంథరుఁడు మఱియొక చోటునకుఁ బోవుటకే నిశ్చయించి పయనమాయెను. స్నేహవశమున హానిని శంకించుచు హిరణ్యకాదులును వెంట నేఁగుచుండిరి. అట్లు నేలమీఁదఁ బ్రయాణము సేయుచుండఁగా నొకవేటకాఁడు చూచి మంథరునిఁ బట్టుకొని వింటికొనకుఁ గట్టివైచి తిరిగి తిరిగి యాకలి గొని యింటికి మరలిపోవుచుండెను. వెంటనున్న మృగవాయస మూషికము లీసంగతి చూచి మిక్కిలి విషాదమొంది వేట గాని ననుసరించి పోవుచుండెను. అట్లు పోవుచు హిరణ్యకుఁ డిట్లు చింతించెను.

"ఒక దుఃఖము ముగియులోపలనే మఱియొక దుఃఖము సంప్రాప్తమయ్యెను. సందు దొరకినపుడే యనర్థములన్నియు నొకదానివెంట నొకటి వచ్చి మీఁదఁబడును. ఆపద గలిగినపుడు ప్రాణములు సయితము లెక్కసేయక కాపాడు సన్మిత్రుఁడు మహాభాగ్యమువలనఁ గాని లభింపఁడు. శోకము నుండియు, శత్రువుల నుండియుఁ గాపాడునట్టియుఁ; బ్రీతి విశ్వాసములకుఁ బాత్రుఁడు నగు 'మిత్రుఁడు' అను నక్షరత్రయము తోడి రత్న మెవరివలన సృష్టింపఁబడెనో కదా! సన్మిత్రుని యందుండు నమ్మకము తల్లియందును, దండ్రియందును, భార్య

యందును, సోదరునియందును గుమారుని యందును గూడ గలుగదు.

ఇదియంతయు దైవకల్పితము. పూర్వకర్మవలని ఫలము మంచిదైనను, చెడ్డదైనను ననుభవింపక తప్పదు. శరీరమున కెల్లపుడు నపాయము సిద్ధము. సంపద లాపదలకు మూలములు. స్నేహము లనిత్యములు. జనించిన దేదియు నశింపక మానదు.

ద్రవ్యాభిలాషచే సంపద గలిగినపు డందఱును మిత్రులగుదురు. సుఖమునందువలె దుఃఖమునందును బాలుపంచుకొనువాఁ డెవ్వఁడో వాఁడే నిజమగు మిత్రుఁడు. దీనికి విపత్తులే నికషోపములు.” ఇట్లు విచారించి చిత్రాంగ లఘుపతనకులతో నిట్లనియెను.

“ఇంక విచారించుచు నూరకుండిన లాభములేదు. బోయవాఁ డీ యడవి దాటకముందే మిత్రుని విడిపింపవలయును. నాకొక యుపాయము తోఁచుచున్నది. చెప్పెదను. వినుఁడు. చిత్రాంగుఁడు కిరాతకుఁడు పోవుమార్గమున నొక మడుగుచెంతఁ జచ్చినట్లు పడియుండవలయును. కాకి చిత్రాంగునిపై వ్రాలి ముక్కుతోఁ బొడుచుచున్నట్లు నటింపవలయును. ఈ బోయ మృగము చచ్చి పడియున్నదని తలఁచి తప్పక మంథరు నచట విడిచి మృగమును గ్రహించుటకై ప్రయత్నపడును. నేనపుడు క్షణములో మంథరుని బంధములు

దెగఁగొఱుకుదును. అపు డాతఁడు నీటిలోఁ బ్రవేశించును. బోయ మిమ్ము సమీపించు సరికి వేగముగాఁ బాఱిపొండు” అని చెప్పఁగా నవి రెండును నట్లే కావించెను.

కిరాతుఁ డలసినవాఁడై పానీయముల ద్రావి యామడు గుదరి నున్న చెట్టునీడ యందుఁ గూరుచుండి యాహరిణముం గాంచి సంతసమంది దాని దరికేఁగెను. హిరణ్యకుం డంతలో వచ్చి మంథరుని బంధములు గొఱికివేయఁగా నాతఁడా జలము లలోఁబడెను. బోయ సమీపించుసరికి లేఁడిలేచి వేగముగాఁ బాఱిపోయెను. ఆవ్యాధుఁ డిదియంతయుఁ జూచి “సిద్ధించిన దానిని విడిచి యెవ్వఁడు మఱొకదానికై లోభపడునో వాఁడు తుదకు ‘రెండింటికిం జెడిన రేవఁ’ డగును అని విచారించి నిరాశుఁడై యింటికిఁ బోయెను. మంథరాదులందఱు నీవిధమున నాపదనుండి తప్పించుకొని సుఖముగా నుండిరి.

రాజపుత్రులారా! మీరును సుజనులగు మిత్రులను సంపాదించి మీరు మేలొంది లోకమునకు మేలుగూర్చుఁడు” అని విష్ణుశర్మ చెప్పఁగా వినివారు కడుంగడు మోదమొందిరి.

మిత్రభేదము

అనంతరము రాజపుత్రులు విష్ణుశర్మతో "ఆర్యా తమదయవలన మిత్రలాభము వినియుంటిమి. ఇఁక మిత్రభేదము వినఁ గుతూహలముతో నుంటి" మని పలికిరి. విష్ణుశర్మవారి కిట్లు చెప్పఁదొడఁగెను

"దక్షిణదేశమున సువర్ణపురమను నగరముగలదు. ఆనగరమున వర్ధమానుఁడను వణిజుఁడు నివసించుచుండెను. అతఁడు ధనికుఁడే యైనను దనకంటె నైశ్వర్యవంతులయిన బంధువులను జూచి వారికంటె నెక్కువ ధనము సంపాదింప వలయునని యూహించెను. తనకంటెఁ దక్కువవానిఁ జూచిన నెవ్వఁడైన నధికుఁడే యగును. తనకంటె నధికులను గుఱించి యాలోచించినపు డెంతవాఁడైనఁ దాను దరిద్రుఁడుగనే యుండును.

"మహాపాతక మొనరించినను ధనముగల నరుఁడు పూజింపఁబడును. చంద్రునివలె స్వచ్ఛమయిన వంశమునఁ బుట్టిన వాఁడైనను నిర్ధనుఁడు నిరాదరింపఁ బడును. కావున ధర్మముదప్పని యేమార్గమున నైన ధనము సంపాదింపవలయును. ధర్మార్థకామమోక్షము లనెడి నాలుగు పురుషార్థములలోపల నర్థమే ముఖ్యమయినది. అట్టిధనము సంపాదించి దానిం గాపాడి పెంపొందింప వలయును. పెంపొందిన దానిని సరియైన విధమున నుపయోగింపవలయును.

ధన ముండియు సరిగాఁ గాపాడకున్నచో నది నశించి పోవును. లభించినధనము వృద్ధినొందింపని యెడలఁ గొంచె ముగా ఖర్చుపెట్టుచున్నను గాటుకవలె హరించిపోవును. ధన ముండియు ననుభవమునకు రానిచో నది నిరుపయోగము దానభోగముల కుపయోగింపని ధనమును, శత్రువిజయము సంపాదింపలేని బలమును, ధర్మమాచరింపని వాని పాండిత్య మును, నింద్రియజయములేనివాని బుద్ధివిశేషమును నిరుపయో గములు.

జల బిందువులను సేకరించుటవలన ఘటము పూరింపఁ బడునటులు సకలవిద్యలు, ధర్మము, ధనము క్షణక్షణముఁ గణము కణముచొప్పున సంపాదింపవలయును. దానోపభోగ ములు లేక రోజులు వెళ్ళఁబుచ్చువాఁడు చర్మముతోఁ జేయఁ బడిన కొలిమితిత్తివలె శ్వాసగలిగియున్నను జీవములేనివాఁడే.

అట్టిధనము సంపాదించు మార్గములలో వాణిజ్యమే యుత్తమ మయినది. అవసరమయిన యెడల దూరదేశముల కేఁగియైన వాణిజ్యము చేయవలయును. ఆలస్యము, స్త్రీసేవ, రోగము, జన్మభూమి విడువకుండుట, యల్పసంతుష్టి, భయము నను నవి యభివృద్ధికిఁ బ్రతిబంధకములు." ఈవిధముగ నాలో చించి వర్ధమానుఁడు వాణిజ్య మొనరించి విశేషధనము సంపా దింప నిశ్చయించుకొనెను.

ఒక మంచిముహూర్తమున నందక సంజీవకము లనెడి రెండెద్దులను గట్టించి వర్ధమానుఁడు బండి సిద్ధము చేయించెను.

కాశ్మీర దేశమునఁ దక్కువగానుండి తన దేశమునఁ బుష్కలముగా నుండు విలువమైన వస్తువులను సేకరించి తన బండి యం దుంచుకొనెను. ఇంకను విస్తారమయిన పలురకము లయిన వస్తువులను సంపాదించి పెక్కు బండ్లనిండ వేయించెను. మరికొన్ని సామగ్రులను కావళ్ళతోఁ గొనిరా సేవకులను నియోగించెను. ఈవిధముగాఁ దగుపరివారమును గూడబెట్టుకొని వర్ధమానుడు వాణిజ్యమునకై కాశ్మీర దేశమునకుఁ బయనమాయెను. సమర్థులకుఁ జేయరాని పనియు, నుద్యోగులకు దూరభూమియుఁ, బండితులకుఁ బరదేశమును, బ్రియమైన మాట లాడువారికి శత్రువులును గలుగరు.

వర్ధమాను డటులు బయలుదేఱి సుదుర్గపర్వత సమీపమందలి యడవి మీఁదుగాఁ బోవుచుండెను. ఆ యరణ్యప్రదేశమున దారి సమముగా నుండక మిట్టపల్లములుగా నుండుటవలన నొకచోట సంజీవకము కాలుజాఱి పడిపోయెను. ఈవిధమునఁ గాలు విఱిగి పడిపోయిన సంజీవకముం జూచి వర్ధమాను డిట్లు చింతించెను.

"పురుషుఁ డెంతప్రయత్నముఁ జేసినను దైవానుకూల్యమును బట్టియే యది ఫలించుచుండును. ఊరక విచారించిన నించుకంతయుఁ బ్రయోజనములేదు. కావునఁ బురుషుఁడు వృథావిచారము మాని కార్యసిద్ధికై మరలమరల యత్నింపవలయును." ఇట్లు నిశ్చయించి సంజీవకము కాడికట్టు వదలించి సేవకులను బంపి యచ్చటికి సమీపమునన్నున్న ధర్మపుర

మను గ్రామమునుండి బలిష్ఠమైన యెద్దును గొని తెప్పించి దానిని బండికిఁ గట్టించుకొని సంజీవకము నచ్చట దిగవిడిచి ముందునకు సాగిపోయెను.

సంజీవకము దైవవశమునఁ గ్రూరజంతువుల బారిఁ బడక యచటి పచ్చిక దిని, సమీపమందలి వాగులోని నీరు ద్రావి క్రమక్రమముగాఁ గాలినొప్పి తగ్గి విఱిగినకాలు తిన్నఁబడి యిటునటుం దిరుగులాడఁ జొచ్చెను. ఆయువు గట్టిగానున్న యెడల సముద్రమున మునిఁగినను, పర్వతము మీఁది నుండి పడినను, మహాసర్పముకాటు దిన్నను బ్రాణములు పోవు. కాలము రానంతవఱకు బాణశతములచేఁ గొట్టినను చావు గలుగదు. కాలము సమీపించినపుడు దర్భముల్లు తాఁకినంత మాత్రముననే ప్రాణము లెగిరిపోవును. దిక్కులేక యడవియందు విడువఁబడిన వాఁడైనను నెట్లో జీవించును. దైవము సాయపడనిచో నింటియందు సకలోపచారములు నుండియు మరణించును.

కొంతకాలమైన పిమ్మట సంజీవకము స్వేచ్ఛగా విహరించుచు బలిసిన శరీరము గలది యయ్యెను. ఒక్కనాఁడుత్సాహాతిశయమున గుహాలు ప్రతిధ్వనించునట్లు మిక్కిలి గట్టిగా ఱంకె వైచెను.

ఆవనమునఁ బింగళకుఁడను నొక సింహము కలదు. అది తనబలముచేత నచటి జంతువు లన్నిటిని లోఁబఱచు

గొని సుఖముగా నా యడవి నేలుకొనుచుండెను. ఆసింహ మానాఁడు దప్పిగొని పానీయములు ద్రావుటకై యమునా నదికిఁ బోవుచు సంజీవక మొనరించిన యకాల మేఘ గర్జ నమువంటి యఱపువిని భయపడి పానీయములు గ్రోలకయే వెనుకకు మరలి తనతావునకుఁ బోయి "ఇది యేమై యుండు" నని యాలోచించుచు విన్నఁబోయి యుండెను.

ఆవనములోనే నివసించుచున్న కరటక దమనకము లనెడి రెండు జంబుకములు పింగళకుఁడు నీరు ద్రావఁబోయి భయపడిన విధము గమనించినవి. అందులో దమనకుఁడు కర టకునిఁ జూచి "సఖుఁడా! మన రాజైన పింగళకుఁడు దప్పి గొనియు జలములు గ్రోలక వెనుదిరిగి పోయి వెఱపుతో నుండెను. కారణ మేమియై యుండును? విషయముఁ కనుఁగొని యాతని భయము మాన్పి యాతని యాశ్ర యము సంపాదింప వీలు పడునేమో?" అనగాఁ గరట కుఁడు "మన మాతని సేవించుట లేనపు డాతని చేష్టలు విమర్శించుట మన కనవసరము. మఱియు నీరాజు, పూర్వ మీతని సేవలు చేయునపుడు నిరపరాధులమగు మనల నవ మానించి యున్నాఁడు. జీవనార్థియై పరులను సేవించుటలో ననుభవించు శీతవాతాతపక్లేశములో నాల్గవపాలు సహించి, తప మొనరించి సుఖము పడయ వచ్చును. ఎవరి జీవనము పరుల కధీనమై యుండదో వారి జన్మము సఫలము. పరా ధీనులై జీవించుటకంటె మరణించుటమేలు. 'లెమ్ము, రమ్ము

పొమ్ము, మాటాడకుము, చెప్పుము ' అని సేవకులను రాజులు బాధించుచుందురు. పణ్యస్త్రీలవలె మూర్ఖులు ధనలాభము కొఱకు మాటిమాటికిఁ దమ యాత్మను సంస్కరించి సంస్కరించి పరుల కుపకరణము గావింతురు. సహజముగాఁ జంచలముఁ, దగని విషయములపైఁ బ్రసరించు నదియు నగు యజమానుల దృష్టిని సేవకులు కడుంగడు గౌరవించు చుందురు.

ఔన్నత్యముం గోరి యడఁగి యుండవలయును. జీవన ముంగోరి ప్రాణములు విడచుట కైనను సిద్ధపడవలయును. సుఖముంగోరి దుఃఖముఁ దెచ్చి పెట్టుకొనవలయును. ఇట్టివిధమున సేవకుఁడు కాఁగోరు మూఁఢు డెవ్వ డుండును'' అని పలుకఁగా విని దమనకుఁ డిట్లనెను.

"మిత్రుఁడా ! అట్లనుట యుచితముగాదు. సంతుష్టి నొంది సకలమనోరథములు దీర్పఁగల ప్రభువులను సేవించు టలోఁ దప్పేమియు లేదు. రాజులకు శ్వేతచ్ఛత్రము, హస్తి తురగాది సైన్యము, చామర వీజనాది సంపదలు ప్రజాసేవను బట్టియేకదా లభించుచుండును ? '' అన, విని మరలఁ గరటకుఁ డిట్లనెను.

"ఏమయినను నది మనపనిగాదు. సంబంధము లేని పనికి సిద్ధపడినవాఁడు మేఁకు నూడఁబెఱికిన కోతివలె మృతి నొందుట నిజము. నీకా కథ చెప్పెదను, వినుము.

మేకును బెఱికి మరణించిన కోఁతి కథ

మగధదేశమునందు శుభదత్తుఁడను నొక వైశ్యుఁడు గలఁడు. చాలకాలము వఱ కాతనికి సంతానము గలుగలేదు. అందువలన నాతఁడు సప్తసంతానములలోనివి యైన దేవాలయనిర్మాణము, చెఱువులు ద్రవ్వించుట, చెట్లునాటించి వన మహోత్సవము చేయుట మున్నగు పుణ్యకార్యములందుఁ దన ధనము వెచ్చించుచుండెను.

ఒకనాఁ డొక దేవాలయము శిథిలమై యుండుటఁ గాంచి దానిని బాగుచేయించుట కావైశ్యుఁడు పూనుకొని తగిన శిల్పులను, బనివాండ్రను నేర్పఱచెను. ఒకనాఁడు వడ్రంగి యొక పేవదూలమును బనివాండ్రచేఁ గోయించుచు నది సులభముగాఁ జీలుటకై యచటనచటఁ గొయ్యమేకులు దిగఁగొట్టించెను. అంతలో వేళదాటుటచేతఁ బనివారందఱు దమతమ యిండ్లకుఁ బోయిరి.

ఇంతలో నొక కోఁతులమంద యచటికి వచ్చి దేవాలయపు గోడలమీఁదను సమీపమందలి చెట్లమీఁదను విహరించుచుఁ బెక్కు రకములుగాఁ జేష్టలు చేయుచుండెను. వానిలో నొకకోఁతి మేకులు దిగఁగొట్టియున్న దూలము నొద్దకు వచ్చి దానిపై గూరుచుండి కొయ్యమేకు రెండు చేతుల తోడను గట్టిగాఁ బట్టుకొనియెను. అపుడాఁకోఁతి తోఁక దూలపు నెఱియలోఁబడి వ్రేలాడుచుండెను. ఆకోఁతి సహజముగు చప

లత్త్వముచేత మేకును బలవంతముగా నూడఁబెఱికెను. నెఱి యలోఁ జిక్కుకొనియున్న తోఁక నలిగివెంటనే యాకోఁతి బాధతో నఱచుచు మరణించెను. కావున మనకు సంబంధము లేని పనికిఁ బోరాదు."

కరటకుఁ డిట్లు చెప్పఁగా దమనకుఁడు, "స్వామి కార్యమునెడ నుపేక్షింపరాదు. ఒకవు డాతఁడు మనల నెట్లు చూచినను నాతఁడు మనకుఁ బ్రభువు కాకపోఁడు" అని పలు కఁగా మరలఁ గరటకుఁడు "ఆపని రాజోద్యోగులది. మన మిపుడు రాజోద్యోగులము గాము. కానవు డితరుల యధి కారము పయిఁ బెట్టుకొనఁ గూడదు. పరుల యధికారము మీఁదఁ బెట్టుకొనువాఁడు కుక్క మొఱుగుటకు బదులుగా నోండ్రపెట్టి దెబ్బతిన్న గాడిదవలె హాని నొందును. నీకా కథ చెప్పెదను; వినుము.

పరుల యధికారము మీఁదఁ బెట్టుకొని మరణించిన గాడిద కథ

వారణాసి యందుఁ గర్పూరపటుఁ డను నొక చాకలి గలఁడు. వాఁడొక నాఁటి రాత్రి, పగలంతయు బట్ట లుదికిన బడలికచేత నొడలెఱుంగక నిదురించుచుండెను. అర్ధరాత్రి మున వాని యింటియందు దొక దొంగ ప్రవేశించెను. వాని యింటిముందు గాడిద యొకటి కట్టివేయఁబడి యుండెను. ఆ యింటి కావలికుక్కయు నచటనే కూరుచుండి యంతయు జూచుచుండెను.

అపు డచటి గాడిద కుక్కతో "సఖుఁడా! దొంగ యింటఁ జొచ్చుట చూచి యుంటివి గదా! గట్టిగా మొఱిగి యజమానుని మేల్కొల్పుటకుఁ బ్రయత్నింపవేలఁ? ఇది నీపని కాదా?" యన శునక మిట్లనెను. "నావిధిని గుఱించి చర్చింప నీకేమి యవసరము? నీవేమి యెఱుఁగుదువు. రాత్రియుఁ బవలుఁ గష్టమనక యీయిల్లు గాచుకొని యుందును. యజమానుఁడు నాయుపయోగముఁ గొంచెమైనను గ్రహింప కున్నాఁడు. నా కాహార మవసర మనెడి యూహయే యాతనికి లేదు. అవసరము లేనపు డధికారులకు సేవకులయం దాదరము తొలఁగి పోవుటలో నాశ్చర్య మేమున్నది?"

ఆ మాటలు వినుసరికి గార్దభమునకుఁ గోపము వచ్చెను. "పని గలుగునపుడు లంచమడుగు భృత్యుఁడు, మిత్రుఁడు నీచులు" అని పలుకఁగాఁ "గార్యకాలమున మాత్రమే భృత్యులయం దాదరముఁ జూపు ప్రభువు యోగ్యుఁ డెట్లగు" నని శునకము గార్దభమును బ్రశ్నించెను.

దానికా గాడిద మఱింతగాఁ గోపించి "యాపత్కాలమున స్వామికార్యము విడనాడు నీవు పాపాత్ముఁడవు. పోనిమ్ము. నీతోడనే యున్నదా? ఏలికను లేపి నాఋణముఁ దీర్చుకొందును." అని పలికి గట్టిగా నోండ్రపెట్టెను. ఆధ్వనికి గాఢ నిద్రలోనున్న రజకుఁడు మేలుకొని నిద్రాభంగమైనదని కోపించి యొకబడియ చేతఁబట్టుకొని తిన్నగా గాడిద యొద్దకుఁ

బోయి దానిం జావమోదెను. ఆదెబ్బ లాయువుపట్టునఁ దాఁకి వెంటనే యది మరణించెను. కావునఁ 'బరుల యధికారము మనకేల?' యని పలికితిని. చచ్చిన పసరముల వెదకి కొనుటయే మనపని. మనకు గావలసినంత తిండి దొరకును. పోవుదము రమ్ము." అని కరటకుఁడు చెప్పినదంతయు విని దమనకుఁ డిటు లనియెను.

"ఏమీ! తిండికొరకే కేవలము రాజును సేవింప వలయుననియా నీ యుద్దేశము? నీవు చెప్పినది మిక్కిలి యనుచితము. మిత్రులకు మేలును, విరోధులకు హానియుఁ జేయఁదలఁచి బుద్ధిమంతులు రాజు నాశ్రయింపఁ గోరు చుందురు. ఏదోవిధమునఁ బొట్ట నింపుకొనలేకపోవుదుమా? విప్రులకు, బంధుమిత్రాదులకు నుపకారము చేయఁగల జీవితమే ధన్యమైనది. తనపొట్ట నిండించుకొనుటకు మాత్రమే యత్నించు చుండువాని జీవితము నొక జీవితమే యగునా? కాకి కడుపు నింపుకొనుచు నెంతకాలము జీవించిన నేమి ప్రయోజనము.

మాంసములేని వట్టి యెముక దొరకి నంతమాత్రమున నే కుక్క మిక్కిలి సంతుష్టినొందును. జంబుకములుమున్నగు జంతువులు వేలఁకొలఁదియుఁ జెంతఁ దిరుగులాడుచున్నను సింహము వానిదెసఁ గన్నెత్తి చూడక యేనుఁగుల కుంభ స్థలములు చీల్చి మెదడు భక్షించుటకై యత్నించుచుండును. ఎవ్వరైనఁ దమ సామర్థ్యమునకుఁ దగిన ఫలమునే కోరుదురు.

కుక్క తనకుఁ దిండిపెట్టువానిఁ జేరి తోకాడించును. చరణ ములు చాచి నేలపై బడి కడుపు, నోరుఁ జూపును. ఇన్ని పాట్లు పడినను దాని కొకటి రెండు ముద్దలకంటె నెవ్వరు నెక్కువ పెట్టరు. ఏనుఁగు గంభీరముగాఁ జూచుచు మంచి మాటలచే బతిమాలించుకొనుచు నాహారము గైకొనును. పౌరుష జ్ఞానకీర్తులచేఁ బ్రసిద్ధి నొందినవాని బ్రదుకే బ్రదుకు. ఎంగిలి మెదుకు లేతికొని తిను కాకి కేమి గౌరవముండును? మంచి చెడ్డ లెఱుఁగక యందఱిచే నిందింపఁబడుచు నుదరపూర ణమే ముఖ్యముగాఁ దలఁచువాఁడు పశువుకన్న నధముఁడు."

ఈవిధముగాఁ దమనకుఁ డిచ్చిన యుపన్యాసము విని కరటకుఁడు 'మనము ప్రధానులము గానపు డింతయాలోచ నము మనకేల?' యన దమనకుఁ డిట్లు జవాబిచ్చెను.

"ప్రధానులగుట కెంతకాలము గావలయును! తాము గావించు కృత్యములే జనులను గౌరవనీయులగు ప్రధానులు గాను, ఖలులుగాను జేయుచున్నవి. మానవులకు గౌరవాగౌర వములు వారి ప్రవర్తనముం బట్టియే కలుగుచుండును. ఖ్యాతి గాంచుట కష్టము. నిందపడుట తేలిక. బండరాయి కొండ మీఁది కెక్కించుట మహాకష్టము. కొండమీఁదినుండి క్రిందికిఁ ద్రోచివైచుట యెకడు సులభము. నూయి ద్రవ్వువాఁడు చుట్టు బ్రాకార మేర్పఱచుకొనుచుఁ దన చర్యచేతనే క్రమముగాఁ గ్రిందికి దిగిపోవునట్లు మానవుడు తన కృత్యములచేతనే యధ స్స్థితిం జెందును."

దమనకుని పలుకులు విని తుదకుఁ గరటకుఁడు "సరే నీమాటలు యుక్తముగనే యున్నవి. ఇపుడేమి చేయవలయు నని నీతలంపు ?" అని యడిగెను.

"మనరాజు నీరుఁద్రావుటకై యమునకుఁ బోయి యెద్దుఱంకె వినియే భయపడి యదియేమో గుర్తింపలేక మరలి యింటికిఁ బోయి విషణ్ణుడై యున్నాఁడు. ఇందుఁ దెలియని దేమున్నది ? ఈసంగతి యెవ్వరును జెప్పనక్కఱ లేదు. నోటఁ జెప్పిన విషయములు పశువులు, హయములు, గజములు, సర్పములు గూడ గ్రహింపఁ గలవు. చెప్పకుండ నాకారాదులచేఁ బరుల యూహాలు గ్రహింపఁ గలవాఁడే పండితుఁడు. నేనిపుడు మనరాజు దగ్గఱకుఁబోయి సందర్భము ననుసరించి యవసరములయిన మాటలు సెప్పి యాతనిభయముఁ బోఁగొట్టి యాతనిఁ బ్రసన్నునిగాఁ జేసికొందును.

'సందర్భమునకుఁ దగిన మాటలు, మంచితనమునకుఁ దగిన ప్రియవచనములు, శక్తికి మించని కోపముఁ గలవాఁడే వివేకి'" యని దమనకుఁడు చెప్పఁగా "నీవు సేవాధర్మము నెఱుఁగవు. చూడుము. పిలువని పనికిఁ బోవువాఁడును, నడుగనిదే సమాధాన మిచ్చువాఁడును, దనవిషయమునఁ బ్రభువు ప్రీతుఁడై యుండెనని నమ్మువాఁడును నవివేకులు" అని కరటకుఁ డనెను.

దానికి దమనకుఁడిట్లు జవాబిచ్చెను. "నేనుసేవాధర్మ మునెఱుంగ కుండుటేమి ? సహజముగా సుందరమైనను గాకు

న్నను నెవరికేది యిష్టమో యది సుందరముగనే కనఁబడును. ఎవనికేయది ప్రియమగునో తెలిసికొని బుద్ధిమంతుఁడు వానినిఁ దనకు సముఖునిగాఁ జేసికొనును. 'అది నాపనిగాదు. సరిగా నాజ్ఞాపింపుము' అనిపలుకక యథాశక్తి రాజాజ్ఞను నెఱవేర్చు చుండవలయును. అధికమైన ప్రతిఫలముఁ గోరనివాఁడై నీడ వలె ననుసరించుచు నాజ్ఞకెదురాడక ప్రాజ్ఞుఁడు రాజసేవయందు బ్రవర్తింపవలయును.

ఏదైననొకవేళ రా జవమానము కలిగించునేమో యను నూహించి రాజసన్నిధి వీడరాదు. ఏదైనఁ గీడుకలుగునని కర్తవ్యము విడుచుట యవివేకుల లక్షణము. అజీర్ణము కలుగునేమోయని భోజనము మానివైచు మూర్ఖుఁ డెవ్వఁడైన నుండునా ? అకులీనుఁడు, విద్యాహీనుఁడు, నయో గ్యుఁడునైనను సర్వదా కనిపెట్టుకొనియుండువానిని రాజులాద రింతురు. రాజులు, లతలు, వనితలు తఱుచుగా దగ్గఱనున్న వానిపై నభిమానము చూపుట సహజము" అనిన విని కర టకుఁ డంగీకరించి "సరే! నీవిపు డటకేఁగి యేమి పలుకు దువు?" అని ప్రశ్నింప దమనకుఁడిట్లు చెప్పెను.

"ముందుగాఁ బ్రభువు నాకు సుముఖుఁడో, కాఁడో తెలిసి కొందును. దూరమునుండి చూచుట, మనవిచేయునపు డాద రము గలిగి వినుట, పరోక్షమున సుగుణముల నెన్నుట, ప్రియ విషయములు తటస్థించి నపుడు స్మరించుట, దానము, ప్రియ వచనము లాడుట, దోషములు గుణములుగా గ్రహించుట

సుముఖుని చిహ్నములు. మఱియుఁ గాలయాపనము, నాశలు రేకెత్తించుట, ఫల మొసఁగకుండుట, విముఖుని లక్షణములు. బుద్ధిమంతుఁ డీసంగతులన్నియు గుర్తింపవలయు. ఇన్ని విధములు నెఱిఁగి పింగళకుని స్వాధీనునిఁ జేసికొందును.''

అన విని కరటకుఁడు "అయినను సమయోచితము గాని ప్రస్తావముఁ జేయకుము. బృహస్పతితో సమానుఁ డైనను సమయోచితములు గాని పలుకులచేత నవమానము నొందును. అనిపలుకఁగా దమనకుఁడు "మిత్రుఁడా! కరటకుఁడా! భయపడకుము. సమయమెఱుఁగక మాటలాడను. ఆపదయందును నపమార్గములఁ బోవునపుడును నడుగకున్నను భృత్యుఁడు స్వామిహితమును గోరి సంభాషింపవలయును. అవసరమయినపుడు కూడ 'మన కేల' యని యాలోచనము సెప్పకయూరకుండు నెడల సేవకుని యునికియే నిరుపయోగము. కాఁబట్టి సఖుఁడా! నాకు బోవుటకు సెలవిమ్ము'' అని కోరెను. కరటకుఁడును "శుభమగుఁగాక. నీదారి సుగమ మగుఁగాక! నీకు యుక్తమని తోఁచిన విధమున జాగరూకుఁడవై ప్రవర్తింపుము. పోయిరమ్ము.'' అని దమనకునిఁ బంపెను.

దమనకుఁడు పింగళకుం జేరుట

అనంతరము దమనకుఁడు వచ్చుచుండుట దూరము నుండియే చూచి పింగళకుఁడు దగ్గఱకుఁ బిలిపించుకొనెను. దమనకుఁడును సాష్టాంగనమస్కారముచేసి కూరుచుండెను.

తరువాత రాజు "చాలకాలమునకుఁ గనఁబడితివి. నేమమా?" యని యడిగెను.

"ప్రభువులకు నావంటి యల్ప సేవకునివలనఁ బ్రయోజన మేమియుండును? అందుచేతఁ దఱచుగా వచ్చుటలేదు. సర్వ సమర్థులగు మీ సత్పరిపాలనమున మా సేమమునకు లోటేమి యుండును? ఎంతటి యల్పుఁడైనను సమయము వచ్చినపుడు భృత్యుఁడు ప్రభువునకుఁ దగిన యాలోచనము సెప్పుట ధర్మ మని మీ దర్శనమునకు వచ్చితిని. పల్లు కుట్టుకొనుటకును, చెవి గోకికొనుటకును నెంతవారికిని గడ్డిపోల్లకూడ నుపయోగపడు చుండఁ గాలుసేతులు గల జంతు వెప్పుడైన నుపయోగింప కుండునా?

ధైర్యము గలవాని కవమానము గలిగినను మతిసెడదు. దివిటీ తలక్రిందుగాఁ బట్టుకొన్నను దానిమంటలు మీఁదికేఁ బ్రసరించుచునే యుండునుగాని క్రిందికిఁ బ్రసరింపవు గదా! ప్రభువు లెఱుఁగని దేముండును? మణి పాదములందు దొరలినను దాని ప్రభ చెడదుగదా! గాజుముక్కను శిరమున ధరించి నను దానికి శోభ గలుగఁ జాలదు. పరిజనులందఱియందు భేదములేక రాజొకే తీరున వర్తించినయెడలఁ గ్రియాదక్షులగు వారు నిరుత్సాహు లగుదురు. పురుషులలో నుత్తములు, మధ్యములు, నధములు నని మూఁడు విధములు. వారిని మూఁడు రకముల పనులయందును నేలిక నియోగింపవలయును. వారికి వారికిఁ దగిన పనులందు యోగింపక వ్యత్యస్తముగాఁ

జేసినచోఁ జూడామణి పాదములందును గాలియందె తలయందును దాల్చి నట్లగును. బంగరు నగలయందుఁ దాపింపవలసిన మణి యిత్తడియందుఁ బొదిగినయెడల నారత్నమున కేమియు లోటురాదు. భృత్యులకుఁ దగిన గౌరవమొసఁగని దోసము రాజుదే యగునుగాని భృత్యులది గాదు.

అశ్వము, ఆయుధము, శాస్త్రము, వీణ, విద్య, నరుఁడు, నారియు నుత్తములప్రాపుచే గణన కెక్కుటయు నధముల సాంగత్యమునఁ జెడుటయు లోకప్రసిద్ధములు. అసమర్థున కెంతభక్తి యున్నను, శక్తిమంతుఁ డపకారియైనను నుపయోగ మేమి ? రాజావమాన మొందిన పరిజనునకు మతిసెడును. వానిం జూచి బుద్ధిమంతుఁ డెవ్వఁడు రాజసమీపమున కేఁగుటకు వెఱచును. పండితులు వీడినరాజ్యమున నీతి సెడును. నీతి చెడినపుడు సకలముఁ జెడిపోవును. రాజగౌరవ మొందిన వాని నందఱుఁ గౌరవించెదరు. రా జనాదరించినట్లు తెలిసిన జను లందఱు నవమానింతురు. ఉచితమైన దానిని బాలుఁడు తెలిపినను గ్రహింపఁదగును. రవిలేని సమయమునఁ జిఱుదీప ముపయోగింపకుందునా ? ” యని దమనకుఁడు పలుకుచుండఁ బింగళకుఁ డిట్టు లనియెను.

“ దమనకా ! ఇంతగాఁ జెప్పనేల ? నీవు మాకుఁ బరమాప్తుఁడవు. కడు యోగ్యుఁడవు. ఇంతకాల మేదో దుష్టుల బోధవలన రాకపోకలు తగ్గించితివి. ఇప్పుడు స్వేచ్ఛగా నీవు చెప్పఁదలఁచిన ముఖ్యాంశములు చెప్పుము. ” అను రాజు

మాటలు విని దమనకుఁడు "మనవి చేసి కొనుచుంటిని. ప్రభువువారు నీరు ద్రావుటకై యమునకుఁ బోవుచు నీరు ద్రావకయే వెఱఁగొంది వెనుదిరిగినచ్చినట్లు కానఁబడుచున్నది. ఇందులకుఁ గారణముఁ దెలిసికొని యవసరమైన సేవ చేయఁ దలఁచి దర్శనమునకు వచ్చితిని" అని వినయమునఁ బలికెను.

అంతటఁ బింగళకుఁడు "దమనకా! అడుగఁ దగిన యంశమే యడిగితివి. ఈరహస్యముఁ దెలిపి యాలోచన మడుగుటకు నమ్మఁదగినవాఁ డొక్కఁడును గానరాకున్నాఁడు.

ప్రస్తుత మీవనమున కేదో యొక యపూర్వ మృగమే తెంచియున్నది. కాఁబట్టి మన కియ్యది విడువఁదగినదని తోఁచుచున్నది. ఆకారణమున వెఱఁగొంది యుంటిని. ఇంతకు ముందే యొక మహాధ్వని వినవచ్చినది. ఆశబ్దముఁ బట్టి చూచిన నాజంతువు మహాబలముగలదై యుండవలయును" అని పల్కెను.

అది విని దమనకుఁడు "ఔను; ఆధ్వని మేమును విని యుంటిమి. అది భయముఁ గలిగించునట్లుగనే యున్నది. అయినప్పటికి నాలోచన లేకుండ ముందుగానే దేశత్యాగము చేయుటకును, యుద్ధమునకుఁ బూనుకొనుటకు మంత్రియైన వాఁ డెట్లు ప్రోత్సహించును? ఇట్టి విషమ పరిస్థితులలోనే భృత్యుల సారము దెలియవలయును. బంధువులు, భృత్యులు, స్త్రీలు ననువారి బుద్ధియు, సామర్థ్యము నాపద లనెడి నొఱపురాళ్ళ

యందే తేలిపోవును. నేఁ జీవించియుండఁగాఁ దమకు భయ మక్కఱలేదు. కరటకుఁడు మున్నగువారిఁ గూడఁ గొంచెము చేరఁ దీయుఁడు. ఏలయన, నాపత్సమయములందుఁ బురుష సాహాయ్య మెంతయు నవసరము." అని చెప్పెను.

పిమ్మటఁ గరటకునిఁ గూడఁ బిలిపించి పింగళకుఁడు వారిర్వురను సర్వవిధముల గౌరవించెను. అపుడు దమనకుఁ డిట్లనెను. "ప్రభూ! ధ్వని విన్నంతమాత్రమున భయపడరాదు. ధైర్యము వహించి కారణముఁ దెలిసికొని ప్రతిక్రియ యాలోచింపవలయును. ఈయర్థముఁ దెలుపు కథ యొక్కటి గలదు. వివరించెదను; చిత్తగింపుఁడు.

పొలికలని యందలి నక్క కథ

పూర్వ మొక నక్క యాకలిగొని వనమం దాహారమునకై తిరుగాడుచు విసువొంది యదృష్టమువలనఁ దుద కొకయుద్ధభూమిం గాంచెను. అందుఁ గుప్పలుగాఁ గూలినరథములు, నవయవములు, పలువకములుగా ఖండితములై పడియున్న యేనుఁగులు, గుఱ్ఱములు, సైనికసమూహములు నిండుగా నుండెను. ఆనక్క యవియన్నియుఁ జూచి సంతసముతో వానిఁ దినుటకై దగ్గఱికిఁ బోవుచుండఁగా నేదో యొక పెద్దచప్పుడు వినఁబడెను. ఆధ్వనితో గుండె లదరి యది పాఱిపోవఁ దలఁచెను. కాని యంతలో నేమి దోఁచినదో యాధ్వని విన వచ్చిన దెసకుఁ బరికించి చూచెను. దూరమున నొకచోటఁబడియున్న

దుందుభియను వాద్యముపైఁ జెట్టుకొమ్మ గాలికి గదలి గట్టిగా దగులుచుండుటవలన నది బిగ్గఱగా ధ్వని చేయుచుండెను. అపుడా నక్క దాని దగ్గరికిఁబోయిఁ యది కొఱకికి చూచి యందుఁ బ్రవేశించి బయటికి వచ్చెను. అట్లు భేరీముఖమంతలి చర్మముఁ గొఱకివేయఁగానే యాధ్వని నిలిచిపోయెను.

అపుడాజంబుకము "ఎంతపొరపడితిని. ఇంత యాహారము విడిచిపెట్టి యీశబ్దమునకు జడిసి పాఱిపోవుటకు సిద్ధపడితిని" అని యనుకొనుచు సంతసముతో గావలసినంత యాహారముఁ దిని తనదారింబోయెను. కావున నాధ్వనికిఁ గారణ మరసి ప్రతిక్రియ చేయుదు" నని పలికెను. పింగళకుఁడు 'సరే' యని సెలవిచ్చి పంపెను.

దమనకుఁ డట్లు బయలుదేఱి పోవుచుండ వానివెంట నరిగి కరటకుఁ డిటు లనియెను. "భయమునకుఁ గారణ మెఱుంగకుండ, నది తొలఁగింప శక్యమైనదో కాదో తెలియకుండ భయప్రతీకారమునకు శపథముచేసి రాజసత్కారము నొందితిమి. ఉపకారముఁ జేసియేకాని యెవ్వరివలనఁ గానుకలు గ్రహింపరాదు. అందునను రాజువలన నెంతమాత్రము స్వీకరింపరాదు. ఏలయన రా జనుగ్రహించెనేని సంపదలు, విక్రమించినయెడల విజయముఁ, గోపించినయెడల మృత్యువును గలిగింపఁగల సమర్థుఁడై యుండును. ఎట్టివాఁడైనను రాజు నవమానింపరాదు. రా జన నరరూపమున నుండు దైవమే కాని

యన్యుఁడుగాఁడు." అనుమాటలకు దమనకుఁడు నవ్వి యిటు లనియెను.

"సఖుఁడా! నీ కేమియు నాందోళన మవసరము లేదు. భయకారణము దెలిసియేయున్నది. అది వర్ధమానుఁడను వణిజునిచే నడవియందు విడువఁబడిన యెద్దు వైచిన అంకెయే గాని యన్యము గాదు. వృషభములు మనముకూడ సులభముగా భుజింపఁదగినవి. రాజువిషయమై సందియ మేల?" యను దమనకుని పలుకుల "కల్లైన ముందే స్వామికిఁ దెలిపి యాతని భయము మానుపరాదా?" యని కరటకుఁడు ప్రశ్నించెను.

దానికి దమనకుఁడు "వెంటనే భయము మాన్పించిన మనకుఁ జిరకాలగౌరవ మెటులు గలుగును? భృత్యులెన్నఁడును స్వామి నిఁక దమ యవసరములేని స్థితికిఁ దేరాదు. ప్రభుని యవసరములన్నియు మిగులకుండఁ దీర్చువాఁడు దధికర్ణునివలెఁ జెడును. నీకా కథ యెఱింగించెదను వినుము.

సింహము పనియంతయు నెఱవేర్చి చెడిన పిల్లి కథ

ఉత్తరదేశమం దర్బుదశిఖర మనెడి యొక పర్వతము గలదు. అందు దుర్దాంతుఁడను మహాబలముగల సింహము వసించుచుండెను. అది కొండగుహాలో సుఖముగా నిదురించుచుండునపు డొక యెలుక రోజును దాని కేసరములు గొఱుకు

చుండెను. ఆ సింహము పట్టుకొనఁ బోఁగా నది దొరకక కలుఁగులోనికిఁ బాఱిపోవుచుండెను.

అపుడు దుర్దాంతుఁడు "క్షుద్రశత్రువును బలముచే సాధించుట కష్టము. అట్టివానిం జంపుటకు వానికిఁ దగిన వాఁడే యుండవలయును." అని యాలోచించి యొక గ్రామము నకుఁ బోయి కడుశ్రమతో దధికర్ణుఁ డనెడి మార్జాలమును నమ్మించి తీసికొనివచ్చి గుహలోఁ దనయొద్ద నుంచుకొని యాహారాదులచే దానిం బోషించుచుండెను. దాని భయము వలన మూషికము కలుఁగు వెడలి వచ్చుటకే భయపడు చుండెను. అందువలనఁ గేసరములు కొఱుకుబాధ తప్పి యా సింహము సుఖముగా నిదురించుచుండెను. ఎలుక చప్పుడు వినవచ్చి నపుడెల్లఁ బిల్లికి దుర్దాంతుఁడు మాంసాహార మొసఁగి ప్రోత్సహించుచుండెను.

పిమ్మటఁ గొంతకాలమైన తరువాత నాకలికిఁ దాళలేక యామెలుక కలుఁగు వెడలివచ్చి పిల్లిచే భక్షింపఁబడెను. అనంతరము చాలకాలమువఱకు నెలుక చప్పుడుగాని యెలుక గాని దుర్దాంతునకుఁ గనఁబడలేదు. ఆకారణమున దుర్దాంతుఁడు దధికర్ణున కాహార మిడుటయం దశ్రద్ధవహించుచుఁ గొంతకాలమునకుఁ బూర్తిగా మానివైచెను. దధికర్ణుఁడును దిండిలేక క్రమముగా బలహీనుఁడై కృశించి మరణించెను. కాఁబట్టి యెన్నఁడును బ్రభువును నిరపేక్షునిగాఁ జేయరాదు."

అని పలికి కరటకుని నొక చెట్టుక్రిందఁ గూరుచుండ నియమించి సంజీవకుని యొద్ద కేఁగి యిట్లు పలికెను.

"ఓ వృషభేంద్రా! ఈయడవిం గాపాడుటకై మృగరాజగు పింగళకునిచే నియమింపఁబడిన సేనాధిపతి కరటకుఁ డిట్లాజ్ఞాపించుచున్నాఁడు. 'త్వరితముగ నాకడకు రమ్ము. లేదేని యీ యడవినుండి దూరముగఁ దొలఁగి పొమ్ము. ప్రభువు కోపించిన యెడలఁ గలుగు ఫలితము లెఱిఁగియే యుందువు. ప్రభువుల కాజ్ఞాభంగము, బ్రాహ్మణుల కనాదరము, స్త్రీలకు పృథఙ్మందిర నివాసము శస్త్రముక్క-అ లేని చిత్రవధ వంటిది.'"

సంజీవకుఁడు మిగులభయపడి చప్పునఁ గరటకుని కడకుఁ బోయి సాష్టాంగనమస్కారముచేసి "సేనాపతీ! నే నెఱుఁగక చేసిన తప్పు లున్నచో క్షమింపుము. ఇఁక నీయాజ్ఞానుసారముగా మెలఁగుదును." అని విన్నవించుకొనెను.

అది విని కరటకుఁడు "ఓవృషభమా! నీవు మా యరణ్యమున నివసించుచున్నావు. కావున మాప్రభువుని కడకు వచ్చి నమస్కరించి విధేయుడవై యుండుము." అని యాజ్ఞాపూర్వకముగాఁ బలికెను.

దానికి సంజీవకుడును "నా కభయ మొసఁగుము. నీయానతి చొప్పున వచ్చి స్వామిసేవ చేయఁగలను." అని

వేడుకొనఁగాఁ గరటకుఁడు "భయపడకుము. సింహము మేఘ గర్జనలకు తిరిగి గర్జించునుగాని నక్క కూఁతలు లెక్క సేయదు. వాయువు సమున్నతములైన వృక్షములనే పెల్లగించునుగాని వంగియుండు తృణముల జోలికిఁ బోఁడు. నీవును వినయ విధే యతలతో మెలఁగిన మారాజు పింగళకుడు నీ కేహానియుఁ జేయడు సరిగదా! నీకేదైన నుద్యోగము కూడ నొసఁగి గౌర వించును." అని పలికెను.

ఈవిధముగా సంజీవకుని లోబఱచుకొని కూడఁదీసికొని పోయి యాతనిఁ గొంతదూరమున నుంచి కరటక దమనకులు పింగళకుని సమీపమునకుఁ బోయిరి. రాజునకు వందన మొన రించి కూరుచున్న యనంతరము "దమనకా! నీవు పోయిన పని యేమైనది? శబ్దకారణ మెఱిఁగి యావైరియెవ్వఁడో తెలిసికొంటివా?" యని పింగళకుఁడు ప్రశ్నించెను.

దమనకుఁడు "దేవా! అంతయు మనవిచేయు చున్నాను. మీ రూహించినటు లాతఁడు మహాజంతువే కాని క్షుద్రజంతువు కాడు. అయినను దమకు విధేయుఁడై వర్తింపఁ దలఁచినవాఁడు కాని విరోధమునకుఁ బూనుకొను వాఁడుగాఁడు. స్వామి యనుగ్రహమున్నచో నుద్యోగిగా నుండి సేవచేయఁ గలఁడు. ఆజ్ఞ యైనచో రప్పించెదను." అని విన్నవించెను. పింగళకుఁ డందుల కంగీకరించెను. దమనకుఁడు బయటికివచ్చి సంజీవకుని రాజు నెదుటికిఁ గొనిపోయెను.

సంజీవకుఁడు మంత్రియుఁ, గరటక దమనకులు కోశాధికారులు నగుట

సంజీవకుఁడు విధేయతతోఁ బింగళకునకు సాష్టాంగ వందన మాచరించి "ప్రభుని యాజ్ఞలకు బద్ధుఁడను" అని పలికెను. పింగళకుఁడు సంతసించి యావృషభమునకు మంత్రి పద మొసఁగి గౌరవించెను. నాటినుండియుఁ బింగళక సంజీవకులు కడుంగడు నమ్మకముతోఁ జెలిమి యొనరించుచు సుఖముగాఁ గాలము గడపుచుండిరి. పింగళకుఁడు కరటక దమనకులను గోశాధికారులుగా నియమించి గౌరవించెను.

స్తబ్ధకర్ణుని రాక - సంజీవకుఁడు కోశాధికారి యగుట

అనంతర మొకనాఁడు పింగళకుని సోదరుఁడయిన స్తబ్ధకర్ణుఁ డచటికి వచ్చెను. పింగళకుఁ డాతని సగౌరవముగా నాహ్వానించి గౌరవించి యాతని కాహార మొసఁగుటకై మృగములను జంప స్వయముగా బయలు దేఱుచుండెను. ఆసమయమున సంజీవకుఁడు "ప్రభూ! చంపఁబడిన జంతువుల మాంసము నిలువ లేదా?" యని యడిగెను.

"కరటక దమనకులకు దెలియవలె" నని సింహము చెప్పెను. "ఉన్నదో లేదో తెలిసికొనుట మంచిది" అని సంజీవకుఁ డనెను. పింగళకుఁడు వర్తమానించి తెలిసికొని "మాంసము నిలువ లే" దని చెప్పెను. "మాంసమంతయుఁ

గరటక దమనకులే తిని వైచుచుండిరా ?" యని సంజీవకుఁ డడిగెను. "ఔను ప్రతిదిన మట్లే జరుగుచుండెను" అని పింగళకుఁ డనఁగా సంజీవకుఁడు "ఈపని ప్రభువుల యెఱుక లోనే జరుగుచుండెనా ?" యని యడిగి "నాకుఁ, దెలిసియుఁ, దెలియకయు జరుగుచుండె" నని పింగళకుఁడు చెప్పఁగా సంజీవకుఁ డిట్లు విన్నవించెను.

"ప్రభూ ! ఇది యెంతమాత్రముఁ దగదు. ఆపదకుఁ బ్రతిక్రియ యొనరించుట దక్క మఱేపనియుఁ బ్రభువునకు నివేదింపకుండ భృత్యుఁడు తనంతఁదాను స్వతంత్రించి చేయ రాదు. కమండలువు తనలోని సారమంతయుఁ ద్యజించి యజ మానుని మేలునకై మిక్కిలి జలమును గ్రహించునట్లు మంత్రి యైనవాఁడు ప్రభువునెడల వర్తింపవలయును. కోశముఁ బెంపు సేయువాఁడే నిజమైన మంత్రి. ఏలయన ; రాజునకుఁ గోశమే ప్రాణములు గాని, ప్రాణములు గావు. పురుషున కేయితరగుణ ములచేతను గోశసమృద్ధివలన వచ్చినంత గౌరవము రాఁ జాలదు. ధనహీను నాలుబిడ్డలే నిరాదరింతు రన నితరుల మాట సెప్పనేల ? అతివ్యయము, నపరిశీలనము, నధర్మార్జ నముఁ, గోశవ్యసనమునకు లక్షణములు. ఆదాయము గుఱు తింపక స్వేచ్ఛగా వ్యయము చేయువాఁడు కుబేరతుల్యుఁ డయినను ననతికాలమున జేటు నొందును."

సంజీవకుని పలుకులు విని స్తబ్ధకర్ణుఁ డిట్లు పలికెను. "సోదరా ! వినుము. సంధి విగ్రహాది కార్యములందు సమర్థు

లును జిరకాలమునుండి యాశ్రయించి యున్నవారు నగు కరటకదమనకు లెన్నఁడుఁ గోశాధికారమున నియోగింపఁ దగినవారు గారు. ఉద్యోగప్రసక్తిలో నేను వినియున్న ధర్మములు తెలుపుదును. వినుము.

బ్రాహ్మణుఁడు, క్షత్రియుఁడు, బంధువుఁ గోశాధికారమున నియోగింపఁదగరు. బ్రాహ్మణుఁడు సంపాదింపఁబడిన ధనము కష్టకాలముననైన వినియోగింపఁడు. క్షత్రియుఁ డన్నిటికి ఖడ్గముఁ జూపును. బంధువు జ్ఞాతిభావముచేత సమస్తము నాక్రమించి హరించును. చిరసేవ యొనరించు నియోగి దోషమునకైనను వెఱవక స్వామిని లెక్కగొనక నిరంకుశుఁడై చరించును. ఉపకారినెన్నఁడుఁ గోశాధికారమున నియమింపరాదు. తానొనరించిన యుపకారము నిమిత్తముగాఁ జేసికొని నిత్యము రాజసన్నిధానమునఁ జరించుచుఁ దానే రాజన్నట్లాతఁడు చరించును. సమృద్ధిగలవానిని మంత్రిగా నియమించిన నసాధ్యుఁడగును. సమృద్ధి చిత్తవికారముఁ గలిగించును.

పిండినకొలఁదియు ద్రవించు దుష్టవ్రణమువలె నుద్యోగులు ప్రభుని యంతస్సారముఁ బీల్చివేయుదురు. ఎంతపిండినను దడివస్త్రము పయోధారల నొసఁగఁ జాలనట్లెంత యొత్తుడు గలిగినను నుద్యోగులు హరించిన ధనముఁ దెచ్చియీయరు.

ఈ విషయము లన్నియు బాగుగా నాలోచించి సంద ర్భానుసారముగా మెలంగవలయును.” సోదరుని యీ మాటలు విని పింగళకుఁడు “అది నిజమేయగును. కరట కదమనకు లీమధ్య నన్నివిధముల నాయాజ్ఞలకు బద్ధులై యుండుచున్నట్లు గానరాదు.” అని చెప్పఁగా మరల స్తబ్ధకర్ణుఁ డిట్లనెను.

“ఆజ్ఞ మీఱెడి వారిని రాజు క్షమించెనేని నాతనికిని జిత్రప్రతిమకు భేద మేమి? సోమరియైన వానికిఁ గీర్తియు, సరళతలేనివానికి స్నేహమును, నింద్రియ నిగ్రహము లేని వానికి గులమును, ధనాశాపరునకు ధర్మమును, లుబ్ధునకు సౌఖ్యమును, వ్యసనములు గలిగియుండు వానికి విద్యాఫల మును, మంత్రుల విషయమై యేమఱియుండు నరపతికి రాజ్య మును నచిరకాలమునఁ జెడిపోవును. కావున సోదరా! తప్పక నామాట పాటింపుము. సస్యము మాత్రమే తిని జీవించు సంజీవకునిం గోశాధిపతిగా నియమించుట యుక్తమని నాయూహ.”

ఇట్లు పలికిన సోదరుని మాటల కంగీకరించి యప్పటి నుండియుఁ బింగళకుడు సంజీవకునిఁ గోశాధికారమున నియో గించెను. ఈ విధముగాఁ బింగళక సంజీవకుల స్నేహము మఱింత ప్రబలెను. అంతేకాక యితరబంధువులందును, మంత్రు లందును బింగళకుని కాదరము తగ్గిపోయెను.

కరటక దమనకుల విషాదము – పన్నుగడ

అనంతర మీవిషయము లన్నియుఁ గరటక దమనకులకు మిక్కిలి ఖేదముఁ గలిగించెను. దమనకుఁడు కరకటకునితో మిత్రమా ! యిపుడు గర్తవ్య మేమి ? ఇది స్వయంకృతాపరాధము. స్వయంకృతదోషమునకు విలపించుట కూడ యుక్తము గాదు. తాము చేసికొన్న దోషముచేత నొక రాజకుమారుఁడు నొకసన్న్యాసియు హాని నొందిరి. నీకా కథలుచెప్పెదను వినుము.

స్వయంకృతాపరాధమువలనఁ జెడిన రాజకుమారుని కథ

సింహళ దేశరాజయిన జీమూతకేతునకుఁ గందర్పకేతుఁ డను నొక కుమారుఁడు గలఁడు. ఆతఁ డొకనాఁ డుద్యానవనమున నుండఁగా నొక యోడబేరగాఁడు వచ్చి " ప్రభూ ! సముద్ర మధ్యమున నొన్నాటి చతుర్దశినాఁడు డొకకల్పవృక్షము బయలుదేఱినది. ఆవృక్షముక్రింద రత్నకాంతులతో దేదీప్యమానముగ నున్న పానుపుపై సర్వాలంకారములు ధరించి వీణవాయించుచు లక్ష్మివలె నుండు నొక కన్య కానఁబడినది. " అని చెప్పఁగా రాజకుమారునకుఁ గుతూహలము గలిగి యాతనితో సముద్రతీరమునకుఁ బోయెను.

సరిగా వణిజుఁడు చెప్పిన చోటున నున్న కన్యకామణింజూచి యామె రూపలావణ్యములచే రాకొమరుఁ డాకర్షింపఁబడెను. వెంటనే యాతఁడు మహాసాహసమున నాబాలా

మణియొద్ద కుటికెను. అట్లుఉకుటయే తడవుగా నాతఁడు బంగరుమేడలతో నిండిన యొకపట్టణమునకుఁ బోయి యందొక సుందరసౌధమున విద్యాధరకన్యలచే సేవింపఁబడుచున్న యా సుందరాంగిం జూచెను.

ఆమెయు రాకొమరుని దూరమునుండియే చూచి యాతనితో మాటలాడుటకై తనచెలికత్తె నంపెను. చెలికత్తె యాతనికడకుఁ బోయి "రాజకుమారా! మాచెలి కందర్పకేళియను విద్యాధరచక్రవర్తి కూతురు రత్నమంజరి. 'ఎవఁడు తనంతటఁ దానీ సువర్ణనగరముం జూచి చేరవచ్చునో యాతనిఁబెండ్లి యాడవలయు' నని యామెసంకల్పము. కావున నీవామెను గాంధర్వ విధిచే వివాహమాడుము" అని పలికెను.

కందర్పకేతుఁ 'డట్లే' యని యంగీకరించి రత్నమంజరిని వివాహమాడి యచటనే హాయిగా సమస్తసుఖములు ననుభవించుచుండెను. ఒకనాఁ డామె యాతనితో "స్వామీ! యీసర్వైశ్వర్యము నీయధీనము, నీయిచ్చవచ్చినట్లు దీని ననుభవింప వచ్చును. ఈచిత్రపటమందలి యాకృతిస్వర్ణ రేఖయను విద్యాధరకన్యది. దీనినిమాత్రము నీవెన్నఁడుఁ దాఁకవలదు. అట్లు తాఁకినయెడల మహాప్రమాదము సంభవింపఁ గలదు. అని పలికెను.

కొంతకాల మట్లు కడచిన పిమ్మట నొకనాఁడు కందర్పకేతుఁడు కుతూహలము నిలుపుకొనలేక యా స్వర్ణ రేఖను

జేతితోఁదాఁకెను. వెంటనే యది చిత్రమే యయినను నామె తన చరణముచేత నారాజకుమారునిఁ దన్నెను. ఆతఁడెప్పటివలెఁ దన రాష్ట్రమందలి యుద్యానవనమునఁ బడి యున్నఁడు నిఁక రత్నమంజరి జాడగానఁజాలక దుఃఖజపీడితుఁ డయ్యెను. ఇంక సన్న్యాసి కథ వినుము.

స్వయంకృతాపరాధమువలనఁ జెడిన సన్న్యాసికథ

మలయపర్వత సమీపమున నొకానొక సాధువు నివసించుచుండువాఁడు. ఆతఁ డొకపుడు పండ్రెండుసంవత్సరములు పయనము సాగించి మలయపర్వత ప్రదేశమునుండి కాంచనపురమను నొకనగరముఁ జేరెను. నాఁటిరేయి యానూతననగరమున నొకవిశాలభవపు టరఁగుమీఁద బండుకొనెను.

అదియొక వేశ్యాగృహము. గృహద్వారమున దారునిర్మితమైన బేతాళ విగ్రహమొకటి గలదు. దాని శిరముమీఁద బ్రశస్తమైన యొకమణి ప్రకాశించుచుండెను. దానిం జూడఁగా నాసాధువున కాస కలిగెను. దానింగ్రహింపఁదలఁచి యాతఁడు చేయిచాచి తాఁకినంతనే బేతాలుని చేతులా సాధువును బంధించి వైచినవి. బేతాళునిచేతుల బిగి కాగలేక యాతఁ డాక్రందన మొనరించుచుండఁగా లోనుండి యొక పరిచారిక యరుదెంచి "ఓయీ! నీవు మలయపర్వతము దరినుండి వచ్చితివి. నీయొద్దనెన్నో మణులుండవలయును. వాని నన్నిటిని

గౌరవముగా నిచ్చివేయుము. లేనిచో నీబంధము నుండి నీకు విముక్తిగలుగుట యసంభవము ” అని స్పష్టపఱచెను. పది మందియు విన్నచో నింకనూ నవమానము గలుగునని వెంటనే తనతగ్గఱనున్న మణులన్నియు నిచ్చివైచి శూన్యహస్తుఁడై యాతఁడు మిక్కిలి విచారము నొందెను.

ఇట్లే యాషాఢభూతి యనువానిచే మఱొక సన్న్యాసికి, మేషయుద్ధమువలన నొక నక్కకు స్వయంకృతాపరాధముచే హాని సంభవించెను. నీకాకథయు వివరించెదను వినుము.

సన్న్యాసిని మోసఁగించిన యాషాఢభూతి కథ

పూర్వము దేవశర్మయను నొక సన్న్యాసియుండెను. ఆతఁడు సన్న్యసించినను లోభగుణము విడువలేకుండెను. జనులకు నిత్యము వేదాంతవిషయము లుపన్యసించుచుండువాఁడు. వారు భక్తితోఁ దెచ్చియిచ్చు కానుకలయెడ ననాదరముఁ జూపువాఁడు. కాని వారిం జిన్నఁబుచ్చ నిష్టములేని వానివలె నటించి యవి స్వీకరించుచుండువాఁడు. ఇట్లు సంపాదించిన ధనమంతయు నొక బొంతలో నుంచి యెవ్వరికిఁ దెలియకుండు నట్లు దానిం గుట్టి మీఁద గప్పుకొని దేశసంచారము చేయు చుండువాఁడు.

ఆషాఢభూతి యను పేరుగల వంచకుఁ డీవిషయము గుర్తించెను. ఆతఁడా సన్న్యాసిం జేరి యధికమైన భయభక్తు

లతోఁ బరిచర్యలు సేయుచుండెను. మఱియు వేదాంతార్థము తెలుఁగఁగోరిన వారివలె నటించుచు నాతని నమ్మించి యాతని వెంట దేశాటన మొనరించుచుండెను.

ఒకనాఁడు వారిరువురు దారిఁ బయనము సేయుచుండఁగా నాషాఢభూతి యొకచోటఁ దటాలున నిలిచెను. తనబట్ట కంటుకొనియున్న యొక పూరిపుడక చేతఁబట్టుకొని దేవశర్మకుఁ జూపి "స్వామీ! నిన్నరాత్రి మనము నిదురించిన వారియింట నీపూరిపుడక నావస్త్రమున కంటుకొన్నది. ఇది వారి సొమ్ము. పరులసొమ్ము తృణమైన నపహరించుట ధర్మముగాదు. కాఁబట్టి యిది వారి కిచ్చి వచ్చెదను" అని పలికి కొంతదూరము వెనుకకుఁ బోయి దాని నచటఁ బాఱవైచి పిమ్మట దేవశర్మను గలిసికొనెను.

ఈ చర్య కా సన్న్యాసి కడు నచ్చెరువొందెను. ఆతని నిస్పృహకు మనసున మెచ్చుకొనెను. తాను ధరించుచున్న బొంత మోయుటకు బద్ధకించి దానిని శిష్యునకిచ్చి పదిలముగాఁ దీసికొనిరమ్మని చెప్పెను. వాఁడు మిక్కిలి సంతసించి యాబొంత నెంతయో జాగరూకతతో మోయుచుండెను. మునుపటికంటె గురువునకు విశ్వాస మధిక మగునట్లు మెలఁగుచుండెను.

వా రట్లు పయనించుచు నొక యరణ్యమార్గమున నుండఁగా సూర్యుఁ డస్తమించెను. ఆచటనున్న యొక చెఱువుం-

జూచి యాచమనము చేయుటకై యా సన్న్యాసి యందు దిగెను. ఆసమయమున నాచెఱువుగట్టుమీఁద రెండు పొట్టేళ్లు భయంకరముగా డీకొని పోరాడుచుండెను. తలలు పగిలి కారిన రక్తము గాలికి గడ్డకట్టి వాని నడుమ మాంసఖండము వలె నేలమీఁదఁ గనఁబడుచుండెను.

ఒకనక్క యదిచూచి మాంస ఖండమే యనుకొని జిహ్వాచాపల్యమున దానిం దినఁదలఁచి దగ్గఱి కేఁగెను. ఇంతలో నంతకుముందు డీకొని మరల డీకొనుటకై వెనుకకు దూరముగాఁ బోయిన పొట్టేళ్ళు మహావేగముగా ముందునకు వచ్చి డీకొనఁగా నడుమనున్న యానక్క వాని తాకుఁడునకు నలిగి వెంటనే చచ్చిపోయెను.

చెఱువులలో నాచమనము చేసిన సన్న్యాసి యదిచూచి 'మాంసమందలి యాశయేకదా నక్కకుఁ బ్రాణాంతకమయ్యె' నని తలఁచుచు గట్టెక్కి శిష్యునిఁ గానక గట్టిగాఁ బిలిచెను. అడవి యంతయు నిటునటు వెదకి చూచెను. ఎచటను వాని జాడ గానరాలేదు. తుద కాతఁడు తన్ను వంచించి ధనముతో నిండిన బొంత హరించినాఁడని నిశ్చయించుకొని మిగుల దుఃఖించెను.

కావున స్వయంకృతదోష మనుభవింపకతప్పదు" అని పలికి కొంతసే పాలోచించి "పింగళకసంజీవకులకుఁ జెలిమి యెట్లు గావించితిమో యట్లే వా రిరువురకు మిత్రభేదము

గల్పింపవలయును. కార్యభంగము వాటిల్లినపు డెవని బుద్ధి చలింపకయుండునో వాఁడే యాపద గడచి గట్టెక్కఁగలఁడు." అని దమనకుఁడు చెప్పెను.

"ఎట్టి బుద్ధిమంతున కైన నొక్కొక్కమాఱు పొరపాటు కలుగుచుండును. అందులకై విచారింప నక్కఱలేదు. కాని గాఢముగ హృదయములందు నాటుకొనియున్న పింగళక సంజీవకుల స్నేహమునకు విఘాతము గలిగించుట శక్యమా?" యని కరటకుఁడు సందేహముతోఁ బ్రశ్నింపఁగా దమనకుఁ డిట్లు చెప్పెను.

ఉపాయ మున్నచో సాధింపరాని కార్య మేదియు నుండదు. కాఁబట్టి చక్కని యుపాయ మాలోచింపవలసి యున్నది. పూర్వమొక వాయస ముపాయముచేత శత్రువయిన కృష్ణసర్పముం జంపెను. నీ కా కథ తెలుపుదును. వినుము.

ఉపాయముచేఁ ద్రాచుఁబామును జంపిన కాకి కథ

పూర్వకాలమున నొక మఱ్ఱిచెట్టు మీఁద గూడు కట్టుకొని వాయసదంపతులు నివసించుచుండెను. ఆ చెట్టు తొఱ్ఱలో నొక కృష్ణసర్పముండి యా కాకి పిల్లలను దినివేయుచుండెను. అందులకుఁ గాకము మిక్కిలి దుఃఖించెను. మరలఁ బ్రసవసమయము రాగా నాఁడుకాకి ప్రియునిఁ జూచి "నాథా ఈ వృక్షమును విడిచి మఱియొకచోటి కేగుఁదము. ఇందలి

సర్పము మన సంతతి నెల్లపుడు దినివేయుచుండెను గదా! అవినీతురాలగు భార్య, దుష్టుఁడగు మిత్రుఁడు, నెదురాడు సేవకులు, సర్పము గల యింటిలో నివాసము నిక్కముగా మహాపాయకరము" అని పలుకగా భర్త యిట్లనెను.

"ప్రియురాలా! భీతిల్లకుము. ఇంతవఱకీ సర్ప మొనరించిన యపరాధములు సహించితిమి. ఇఁక నోర్వఁదగదు. తప్పక ప్రతీకార మొనరించెదను."

ఆమాటలకు "బలవంతునితో విరోధము మేల?" యని భార్య పలుకఁగా భర్త "నీకు సందేహము వలదు. బుద్ధిబలముగలవానికి దేహబలముతో నిమిత్తము లేదు. బుద్ధిబలములేకున్న శరీరబల మెందులకుఁ గొఱగాదు. మదించిన సింగమును బుద్ధిబలముచేతనే కదా కుందేలు చంపినది. నీకా కథ వెతింగించెదను; వినుము.

బుద్ధిబలమున సింహముం జంపిన కుందేటి కథ

మందర మనెడి కొండమీఁద దుర్దాంత మనెడి సింహము గలదు. అది యెల్లవేళల జంతువు లన్నిటిని వేటాడి చంపుచుండెను. ఆ యుపద్రవమునకుఁ దాళలేక యొకనాఁడు జంతువు లన్నియు సభచేసి యాలోచించుకొని తమ ప్రతినిధిగా నొకజంతువు నాసింహము నొద్దకుఁ బంపినవి. అది సింహమును సమీపించి వినయముతో "మృగరాజా! ఒకేపర్యాయ మనేక జంతువులను జంపినయెడల నీ కేమి లాభము. జంతు

సంతతి యంతయుఁ నశించినవెనుక రాజ్యాధిపత్య మెవరిపై వహింతువు. దయచూపితివేని మేమే నీయాహారమునకై దిన మునకొక్క మృగమువంతునఁ బంపఁగలము.” అని విన్నవిం పఁగా సింగము ‘సరే’ యని యంగీకరించెను. నాఁటినుండియు నాజంతువులు పంపిన యాహారమే తినుచుండెను.

ఇట్లు కొంతకాలము జరగినవెనుక నొకనాఁ డొక కుందేటికి వంతు వచ్చెను. అపు డది యిట్లు తలపోసెను. “భయ హేతువు గలిగినపుడు ప్రతిప్రాణియు జీవితాశచేత నుపాయము వెదకును. మరణ మెట్లులైనఁ దప్పనియప్పుడు సింహమున కేల జడియవలయును?” ఇట్లాలోచించుచు నాకుందేలు నెమ్మదిగా వెడలుచుండెను.

సింగ మాకలికిఁ దాళలేక యాకుందేలు కనఁబడఁగానే కోపముతో “నీవేల యింత యాలస్యము చేసితివి?” అని యడిగెను. దానికి “స్వామీ! కరుణింపుము. నేను బయలు దేటి వేగముగా వచ్చుచుండ దారిలో నన్నొక సింహము పట్టుకొని తినఁబోయెను. ‘తప్పక తిరిగి రాఁగల’ నని శప థముచేసి యాసింహమును నమ్మించి వచ్చుసరి కింతయాలస్య మయినది.” అని కుందేలు బదు లీయఁగా సింహము కనుల నిప్పులు రాలునట్లు చూచి మిక్కిలి కోపమున “రమ్ము, శీఘ్రముగా నాసింహ మెచ్చటనున్నదో చూపుము. నారా జ్యమునం దింకొక సింహము ప్రవేశించి నాయాహారము నరికట్టు టయా?” యని గర్జించెను.

కుండే లిట్లు సింహమును గొంతదూరము తీసికొని పోయి యచటనున్న యొక లోతైన పాడునూయి చూపి "స్వామీ! యిందున్నది; చూడు" మనెను. ఆసింహము బుద్ధిహీనతచే నూతియందుఁ దన ప్రతిబింబముఁ జూచి వేఱొక సింహ మనిభ్రమించి కోప మాపుకొనఁజాలక గట్టిగా గర్జించుచు నందుఱికి ప్రాణములు గోలుపోయెను.

కుండే లొనరించిన సాహసము విని యాయడవి యందలి జంతువులన్నియు దానిని మిక్కిలి మెచ్చుకొనెను."

ఈ మాటలు విని "యిప్పుడేమి యుపాయ మాలోచించితివి?" అని భార్య యడుగగా వాయస మిటులనెను.

"ఇచటికి సమీపమున నున్న సరోవరమునందు రాజపుత్రుఁడు ప్రతిదినము వచ్చి జలక్రీడ సేయుచున్నాఁడు. స్నానసమయమం దాతఁడు మణులు పొదిగిన తన చేతియుంగరముం దీసి గట్టుపై నిడును. అపుడు దానిని ముక్కునఁ గఱచికొని వచ్చి యీచెట్టు తొఱ్ఱయం దుంచెదను." అని పలికి యొక నాఁ డావాయస మట్లే చేసెను.

రాజభటు లాయుధములు చేతఁబట్టుకొని యుంగరము వెదకుచు నాచెట్టును సమీపించి తొఱ్ఱలో నుంగరముం జూచి యచట 'బుస్సు బుస్సు' మనుచున్న కృష్ణసర్పముం జంపి యాయుంగరముఁ గొనిపోయిరి. కాఁబట్టి యుపాయముచేతనే పింగళక సంజీవకులకు విరోధము గలిగింపవచ్చును" అని పలికి

కరటకుని వీడుకొని పింగళకునియొద్దకుఁ బోయి వందన మాచరించి దమనకుఁ డిట్లనెను.

దమనకుఁడు పింగళకుని మనసు విఱుచుట

“ప్రభూ! ‘ఆపద గలిగినపుడుఁ, జెడుత్రోవఁ బట్టినప్పుడుఁ, గార్యసమయము దాఁటిపోవునపుడును మేలుకోరు మంత్రి రాజడుగకున్నను హితముఁ జెప్పవలయు’ నని పెద్ద లందురు. రాజుపభోగమునకుఁ దగినవాఁడు. కర్తవ్య మేమఱక మంత్రి కనిపెట్టుచుండవలయును. అట్లు చేయని మంత్రి ద్రోహి యగును. సమయము వచ్చినపుడు స్వామి కార్య ముపేక్షించుటకంటె మరణము మేలు.”

ఇట్లు పలుకుచుండఁ బింగళకుఁడు “దమనకా! నీకు సందియము వలదు. చెప్పఁదలఁచినది నిశ్శంకముగాఁ జెప్పుము. నీమనసునకు బాధ కలిగించిన విషయ మెయ్యది?” యని యడుగ దమనకుఁ డిట్లనెను.

“దేవా! మీవిషయమై సంజీవకుని నడవడి యేమియుఁ జక్కఁగాలేదు. తొలుత నాతఁ డిట్టివాఁడని యెంత మాత్రముఁ గనిపెట్టలేక పోయితిమి. అచట నచట మీమీఁద నేరము లెన్నుచు మీసామర్థ్యముం దూలనాడుచున్నాఁడు. ఆతని వైఖరిం జూచినచోఁ గ్రమక్రమముగాఁ గొలఁది కాలములో నీరాజ్యమే వశపరచుకొన నూహించు విధము గోచరించుచున్నది.

ఈసంగతి కొంతకాలమునుండి వినుచుండియు నేసంగతి నైనను స్పష్టముగా గమనింపకయే వ్యవహరింపరాదని యూరకుంటిని. కాని యింక నూరకున్న యెడలఁ గార్యము మించిపోవున ట్లుండుటచేతఁ జెప్పక తప్పినదిగాదు. మంత్రులందఱిం బరిత్యజించి సర్వాధికారము లీతని కిచ్చుటవలన నీయపాయము గలిగినది.

రాజ్యలక్ష్మి, సమర్థుఁడైన మంత్రియం దొకపాదమును, రాజునం దొకపాదమును మోపి నిలిచియుండి స్త్రీసహజమైన చాపల్యముచేత నొకరిని విడిచి మఱియొకరిం జేరుచుండును. ఒక్కనికే రాజు సర్వాధికారము లొసఁగినచో నాతఁడు గర్వించి స్వతంత్రింప నెంచును. స్వాతంత్ర్యమం దిచ్ఛగలిగిన మంత్రి రాజునకుఁ బ్రాణాపాయముఁ గలిగింప సాహసించుటలో వింత యేమి యున్నది ?

విషము గలిసిన యన్నమును, గదలిన పంటిని, దుష్టుఁడగు మంత్రిని సంపూర్ణముగా విసర్జించుటే యుత్తమము. ఎవఁడు రాజ్యలక్ష్మిని సచివాయత్త నొనరించునో వాఁడు మంత్రి దుష్టుఁడైనపుడు గతిలేక దుఃఖ మనుభవించును. సంపద గోరని వాఁడును లోకమున నుండడు. ” అని దమనకుఁడు చెప్పిన మాటలన్నియు విని కొంచె మాలోచించి పింగళకుఁ డిట్లనెను.

“ ఓయీ ! దమనకా ! శరీరము సకలరోగములకుఁ దావలమైనను దాని నెవ్వరును విడిచిపెట్టుటకు సిద్ధపడరు.

అట్లే ప్రియమిత్రుఁ డొకవేళఁ గొంత తప్పిద మొనరించినను విడిచి వేయవచ్చునా? నాకు సంజీవకునితోడి చెలిమి మేర లేనిది కదా! ఇండ్లు, సకల సామగ్రులుఁ గాల్చివేయునదియే యైనను సకల జనులకు నగ్ని యాదరణీయముగాదా?” ఇట్లు ప్రశ్నించిన రాజునకు దమనకు డిట్లనియె.

“సుతునియందుఁగాని, యమాత్యుని యందుఁగాని తటస్థునియందుఁగాని మితిమీరిన ప్రీతిఁ జూపు రాజును లక్ష్మి విడుచును. పథ్యపుఁ బదార్థ మంతరుచిగా లేకున్నను దుద కారోగ్యసుఖము గలిగించును. హితము చెప్పువాఁడును, నది చక్కఁగా గ్రహించువాఁడును గలుగుచోట లక్ష్మి నిలిచియుండును. నీవు చిరసేవకుల నీసడించి నూతనముగా వచ్చినవాని కాధిక్య మిచ్చితివి.” దమనకుని యీమాట లాలకించి “ఇది కడు వింతగా నున్నది. నన్ను శరణు సొచ్చి; యభయ మొసఁగి పోషించుచున్న నన్నే యాతఁ డెట్లు ద్రోహము సేయును?” అని పింగళకుఁడు ప్రశ్నింపఁగా మరల దమనకుఁ డిట్లు పలికెను.

“ఎన్నివిధముల యత్నించినను గుక్కతోఁకకు వంకర పోజాలదు. దుర్జనుఁ డెన్ని యుపకారములు పొందినను వాని మనసు పరిశుద్ధము కానేరదు. విషవృక్షము లమృతము వోసి పెంచినను మంచి పండ్లీయఁ జాలవు. వర్ధనము, పోషణము దుష్టునకు మంచిగుణములు గలిగింప లేవు. హానినుండితప్పించు మిత్త్రుఁడును, ననుసరించి వర్తించు స్త్రీయును, గర్వము గలి

గింపని సంపదయు, నింద్రియములకు లోఁబడని పురుషుఁడును నుత్తములు. కాఁబట్టి యడుగకున్నను స్వామికిఁ బరాభవము దటస్థించుట సహింపఁజాలక చెప్పుచుంటిని. సంజీవకుని తప్పు లన్నిటిని వినియుఁ బ్రభు వూరకున్నయెడల నా దోషము లేదని తృప్తిపడుదును."

ఇంతగా నొక్కి చెప్పుచున్న దమనకుని మాటలు విని "గుణదోషము లెఱుఁగక యేపనియుఁ జేయరాదు. గర్వముచేత నెవఁడు సర్పమునోటఁ జేయిదూర్చును? దోష మున్నచో దండింపక విడచుటయుఁ దప్పే. దోషము లేనిచో దండించుట యెంతమాత్రముఁ దగదు." అని పింగళకుఁడు మనసున నాలోచించుకొని దమనకునితో "ఆతని నిరాకరించి వెడలఁగొట్టుట యుచితమా? హెచ్చరించి చూచుట మంచిదా?" యన దమనకుఁ డిట్లనెను.

"వలదు, వలదు. ఇంతలోనే మంత్రభంగము గావింపరాదు. మంత్రబీజము భగ్నము గాకుండ బహుయత్నములచేఁ గాపాడవలయును. ఒకసారియది భగ్నమైన నిఁక నది యంకురింపఁ జాలదు. చేయఁదగినది యెవ్వరు నెఱుఁగకుండ వేగముగాఁ జేయుట మంచిది. అధీరుఁడగు యోధుఁడు సర్వాంగములు గవచముచేఁ గప్పుకొనియుండియుఁ బరులు భేదింపఁగలరను భయమునఁ జిరకాలము యుద్ధరంగమున నిలువఁజాలఁడు. అట్లే మంత్ర మెన్నివిధములఁ గాపాడుచున్నను జిరకాలము నిలువఁజాలదు."

ఈమాటలు విని పింగళకుఁడు "ఆతఁడు నిజముగా విరోధించినను నా కపాయుము జేయఁగలుగు సామర్థ్య మాతనికేమిగలదు" అని మరలఁ బ్రశ్నింపఁగా దమనకుఁ డిటులనెను.

"అ ల్పెన్నఁడుఁ దలఁపరాదు. క్షుద్రశత్రువు కూడ నొకపు డెంత యపకారమైనఁ జేయఁగలఁడు. ఆతనికిఁ బరంపరగా నెందఱి స్నేహ ముండునో యెవ్వరి కెఱుక ? చూడుము. ఒకటిట్టిభము మిత్రవర్గము దోడుగాఁగా సముద్రమును సాధించెను. నీ కా కథ యెఱింగించెదను వినుము.

టిట్టిభము సముద్రుని సాధించిన కథ

దక్షిణసముద్రతీరమున నొకపు డొక టిట్టిభము, దాని భార్యయు నొక చెట్టుమీఁద గూడు కట్టుకొని నివసించుచుండెను. భార్యకుఁ బ్రసవదినములు సమీపింపఁగా నొకనాఁడది భర్తతో నిట్లు సంభాషణము సాగించెను.

భార్య — నాథా! ప్రసవమునకుఁ దగినచోటు వెదకుము.

భర్త — ఇది తగిన స్థలము గాదా ?

భార్య — ఇది సముద్రము నానుకొని యున్నది.

భర్త — సముద్రముచేఁ బీడింపఁ బడునంత యసమర్థులమా మనము ?

భార్య — మనకును సముద్రునకును భేదము చాలఁగలదు. యుక్తాయుక్తములు, శక్యాశక్యములుఁ దెలియు పరిజ్ఞానము

గలుగువాఁ డెన్నడు దుఃఖము పాలుగాఁడు. మఱియుఁ దనకుఁ గలుగఁ బోవు పరాభవముఁ దొలఁగించుకొనఁ గలుగును. అనుచితమైన పనులు చేయుట, బలవంతునితోడి పగ, స్త్రీల యెడ నమ్మకము ననునవి మృత్యువునకు ద్వారములు.

ఇట్లు సంభాషణము జరిగిన వెనుక భర్త భయములేదని భార్యకు నచ్చఁజెప్పెను. తుదకు భార్య యచటనే ప్రసవించెను.

ఆదంపతుల సంభాషణము లన్నియు విన్నవాఁ డగుట చేత సముద్రునకు వారి శక్తి యెఱుఁగవలయునని తలఁపు గలిగెను. తన తరంగములచే వాని గ్రుడ్లన్నియు నపహరించెను.

అందు కాదుతీతువు మిక్కిలి విచారించెను. మగతీతువు భార్య నోదార్చి తనజాతిపక్షుల నెల్ల రావించి తనకుఁ గలిగిన హాని వానికి వివరించెను. వాని సానుభూతి సంపాదించి వాని నన్నిటిం దీసికొని గరుత్మంతునికడ కేఁగెను. వినయపూర్వకముగా వందన మొనరించి "ప్రభూ! తప్పేమియుఁ జేయకున్నను సముద్రుఁడు నా కపకార మొనరించినాఁడు. నా సంతతిని నాశన మొనరించినాఁడు" అని విచారమునఁ బలికి తనకు గలిగిన కష్టములు వివరించెను.

గరుత్మంతుంతుఁ డీమాటలు విని జాలినొంది తనస్వామి యగు విష్ణువునకు వృత్తాంత మంతయు నివేదించెను. సేవకుని

మనవి యాలకించి విష్ణువు సముద్రుని దండించుట కాజ్ఞ యొసఁగెను.

సముద్రుఁ డా సంగతి విని భయపడి పక్షిగ్రుడ్లన్నియు బంగారు పాత్రమున నిడి తీసికొనివచ్చి యా తీతువునకు సమర్పించెను. కాఁబట్టి సంజీవకుని క్షుద్రుఁడని తేలికగాఁ జూడరాదు. తాము పరాకున నున్నపుడు దర్పమునఁ గొమ్ములతోఁ బొడువ వచ్చినపుడే యా సంజీవకుని స్వభావము గుఱుతింపవచ్చును." అని శక్య మయినంత వఱకు బోధించి సెలవుఁ బుచ్చుకొని దమనకుఁడు మెలమెల్లగా సంజీవకుని కడకుఁ బోయెను.

దమనకుఁడు సంజీవకునకు దుర్బోధ చేయుట

దమనకుఁడు చింతాకులుని వలె నుండుటఁ జూచి సంజీవకుఁడు "మిత్రమా! కుశలమే కద! నీవింత దైన్య మొందినవానివలె నుండుటకుఁ గారణమేమి?" యని ప్రశ్నింపఁగా దమనకుఁ డిట్లనెను.

"సేవకునకుఁ గుశల మనునది యెట్లుగల్గును? సంపదలా పరాధీనములు. చిత్త మెల్లపుడు నశాంతమై యుండును. జీవితమందు విశ్వాసముగూడ నుండదు. సేవకునివిధ మిట్టిది.

ధనము సంపాదించి గర్వింపని వాఁడును, విషయాసక్తుఁడై యాపదలకు లోఁగనివాఁడును, తరుణులఁ జూచి

మనసు చలింపనివాఁడును, రాజున కెల్లకాలముఁ బ్రియుఁడై యుండఁగలుగువాఁడును, మృత్యువునకు వశుఁడు గానివాఁడును, యాచకుఁడై గౌరవముఁ గాంచువాఁడును, దుష్టుల పన్నాగములకు లొంగి కుశలముగాఁ దప్పించుకొనఁగలుగువాఁడును లోకమున నుండు టరిది."

దమనకుని పలుకులు విని సంజీవకుఁ "డిపు డేమి యాపద దటస్థించినది? తెలుపు" మనఁగా దమనకుఁడు మరల నిట్లనియెను.

"ఏమని చెప్పుదును? దురదృష్టవంతుఁడను. సముద్రమున మునిఁగిపోవుచు సర్ప మాధారముగా లభించి నపుడు దానిని గ్రహించుట యెట్లు? విడచుట యెట్లు? ఒకవంక రాజవిశ్వాసము, మఱియొకవంక బంధువినాశము. ఏమి చేయుదును?" ఇట్లు పలికి నిట్టూర్పువిడిచి యూరకుండఁగా సంజీవకుఁడు "మిత్రమా! ఏది యెట్లు జరిగినను వృత్తాంత మంతయు నున్నది యున్నట్లు వివరింపుము" అని పలుకఁగా దమనకుఁడు మిక్కిలి సమీపమునకు వచ్చి రహస్యముగా నిట్లనెను.

"రాజవిశ్వాసమువలన నీ సంగతి యెంతమాత్రముఁ జెప్పరానిది. అయినను నీవు నాయందలి నమ్మకముచేత నిచటికి వచ్చిన వాఁడవు. పరలోకవాంఛవలన నీకు హితము చెప్పుట నా విధి. వినుము. మన ప్రభువు నీపయి నెంతయో యలుకఁ జెందియున్నాఁడు. నినుఁజంపి సేవకులకు సంతర్పణముఁ

శేయుదునని రహస్యముగా శపథముఁ బూని యున్నాఁడు. ఈసంగతి విన్నప్పటినుండియు నేను పొందుచున్న పరితాపమునకు మేరలేదు."

దమనకుని మాటలు విని సంజీవకుఁడు "సఖుఁడా! విషాద మొందకుము. దైవవశమున నెప్పు డేది వచ్చునో దానికి సిద్ధపడి యుండవలయును. ఆపద వచ్చినపుడు సమయానుసారముగా వర్తించి వీలయినచోఁ దప్పించుకొనవలయును" అని పలికి యించుకసే పూరకుండి తనలో "ఈ వ్యవహారము వలన దుర్జనుల చిత్తవృత్తి యెట్టిదో తెలియుచున్నది. ఈలోకమున స్త్రీలు దుర్జనులకే వశులగుదురు. రాజపాత్రులనే యాదరించును. లోభికే ధనము లభించును. మేఘుఁడు కొండలయందు వర్షించును. ఎంతహాని సంభవించినది? ఎన్ని విధముల యత్నించి కొలిచినను రాజనకుఁ దృప్తికలుగ దనుమాట ముమ్మాటికిని నిజము. ఇది యుపాయము గానరాని యపాయము. ఏలయన నెవరైనఁగారణముండి కోపించినచో నా కారణము తొలఁగఁగానే యదియుఁ బోవును. కారణము లేకుండ బగఁ బూనినవాని కోప మెవరు పోఁగొట్టఁగలరు? రాజునకు నే నేమి యపకార మొనరించితిని? రాజు లనఁగా నకారణముగనే హాని సేయువారా? ఒక్కొకరాజు తనకు మేలు చేసినవారి యెడనే పగవహించును. కీడొనరించిన వారియం దమితమగు ప్రీతిఁ జూపును. సేవాధర్మమిట్టిది. ఇందలిరహస్యము యోగులకైన నెఱుఁగ రానిది.

మంచిగంధపుఁ జెట్టునఁ బ్రాముఁ బాములుఁ, జక్కని కమలములుగల చెఱువులందు మొసళ్లు, సుఖములయందు విఘ్నములుఁ జేరియుండును.

మంచిగంధపుఁ జెట్టున మొదట సర్పములు చుట్టుకొని యుండును. కుసుమములయందుఁ దుమ్మెదలు క్రమ్ముకొని యుండును. శాఖములపై నెలుఁగుబంటులు నివసించును. శాఖాగ్రములపైఁ గోఁతు లల్లరిచేయుచుండును. దానియందు దుష్టు లాశ్రయింపని భాగము గొంచెమైనను లేదు. ఈ ప్రభువు మాటలు తియ్యఁగాఁ బలుకును. హృదయమున విషము ధరించియుండును. చేష్టలన్నియుఁ బ్రేమమయములుగఁ గానఁ బడును. ఈతఁ డీవిద్య యెచ్చట నేర్చినాఁడో కదా!

సముద్రము దాఁటుటకు నావయుఁ, జీకటి దొలఁగించుటకు దీపము, గాలి లేనపుడు విసనకఱ్ఱయు, నేనుఁగుల మద మణంచుట కంకుశము ననెడి యుపాయములు దేవుఁడు కల్పించియున్నాఁడు. కాని దుష్టుని మనసు మార్చుట కే యుపాయములుఁ జూపఁజాలక భగ్నమనోరథుఁ డయినాఁడు." అని తలపోసి మరల నిట్టూర్పుపుచ్చి యిట్లు చింతించెను.

"కేవలము సస్యముఁ దిని జీవించు నన్ను మృగరా జేల చంపవలయును? విత్తము, బలము, సమముగాఁ గలవారితోఁ గలహించుటకుఁ గారణముండును గాని నావంటివానిపైఁ గోప

మేల కలుగవలయును. ఎవఁడు నాపై రాజున కలుకపుట్టించెనో తెలియదు.

స్ఫటికముతోఁ జేయఁబడిన వలయము విఱిగినచో మరల నదుకరాని యట్లు రాజునకు విముఖత గలిగినపుఁ డాతని మనసు మరలుప శక్యముగాదు.

పిడుగు, రాజతేజము మిక్కిలి భయంకరములు. అందు మొదటిది యొక్కచోటనే పడును. రెండవది యన్నిప్రదేశములందుఁ బడును.

ఇఁక నాతని యాజ్ఞ కెదురు చూచుట మంచిదిగాదు. మరణించిన స్వర్గము గలుగును. శత్రునిఁ జంపిన సుఖము గలుగును. శూరునకీ రెండే మంచిదారులు. యుద్ధము చేయకున్నను మరణము తప్పనిసరియై, యుద్ధము చేయునెడ బ్రదుకుటకుఁ గొంచెమైన వీలున్నపు డది యుద్ధముచేసి తీరవలసిన సమయమని బుద్ధిమంతులు తలఁచెదరు. కావున యుద్ధమొనరించి చచ్చుటయే మేలు." సంజీవకుఁ డీవిధమున నాలోచించి దమనకునితో నిట్లనెను.

"మిత్రమా! ఆతఁడు నన్నేవిధమునఁ జంపఁ దలఁచెనని నీయభిప్రాయము?"

దానికి దమకుఁడు "పింగళకుఁడు చెవులు నిగిడించి నోరు దెఱచికొని, చరణములెత్తి నీమీఁది కుఱుకుటకు సిద్ధ

పడినపుడు కొలఁది గడియలలో నీవే తెలిసికొనఁగలవు. కాని యీ విషయ మంతయు గుప్తముగా నుంచుము. రహస్య మేమాత్రము వెల్లడియైనను నీతోఁబాటు నాకును జీవితము నేఁటితో సరి." యని సమాధాన మిచ్చెను. కొంతసే పిట్లు తగని వగలు నటించి సంజీవకునిఁ బింగళకుని మీఁద యుద్ధము నకుఁ బురికొల్పి యాతని వీడుకొని కరటకుని కడకుఁ బోయెను. ఆతఁ "డేమి జరిగినది" యని యడుగఁగా దమ నకుఁ డిట్లు చెప్పెను.

"సందియమేల? దుష్టులకుఁ జుట్టములును, యాచించి నచోఁ గోపింపనివాఁడును, విత్తముతో సంతుష్టినొందువాఁ డును నెందైన నుందురా?"

ఈ విధముగాఁ బలికి తిన్నఁగా దమనకుఁడు పింగళకుని కడ కేఁగి వందన మాచరించి యెంతో దిగులు చెందిన వాని వలెఁ గూరుచుండెను. పింగళకుఁడు "దమనకా! సంజీవకుని వైఖరి యేమైన మరలఁ దెలియవచ్చినదా?" యని ప్రశ్నిం పఁగాఁ "బ్రభూ! చెప్పుటకు నోట మాట రాకున్నయది. ఆతఁ డెంతదుష్టుఁ డయినను నేమైనను మంచి యూహ కలుగు నేమో యని యాసించి యాతనిజాడ గనిపెట్టి యుంటిని. ఆతఁడు తనపాపపుఁ జింత విడువలేదు సరికదా! యిఁక నెంత మాత్రము నాలసింపక ప్రభువువారి కాపదగలిగింప నుద్యుక్తుఁడై యున్నాఁడు. కొలఁది నిముసములలోనే ప్రభువు వారి

మీఁది కాతఁడు రాఁగలడని యాతని వైఖరింబట్టి నాకుఁ దోఁచినది. కావునఁ బ్రభువా రేమఱక యుండుదురు గాక యని నా మనవి. ”

సంజీవకుని వధ

దమనకుఁ డిట్లు పలుకుచుండఁగనే పింగళకునకు దూర మున సంజీవకుఁడు వచ్చుచున్న జాడ తోఁచెను. అంతటఁ బెల్లు బికి వచ్చుచున్న కోపము నడఁచుకొనఁ జాలక నోరు దెఱచి కొని చరణము లెత్తి మీఁదికి దుమికి సంజీవకు నొక్కుమ్మడిఁ జీల్చి వేయుటకు సంసిద్ధుఁడై యుండెను.

సంజీవకుఁడును దూరమునుండియే పింగళకుని వైఖరిం జూచి దమనకుఁడు చెప్పిన దంతయు ‘ అక్షరాల ’ నిజము కదా ! యని యెంచి తనశక్తి కొలదియు విక్రమముఁ జూప దలఁచి తలవంచి కొమ్ము లేటవాలుగాఁ జేసి యతి వేగమున సింహము నొక్క క్రుమ్ము క్రుమ్మెను. పింగళకుఁడు నాదెబ్బకు నొచ్చుకొనియు సంజీవకుని బలమునకు మెచ్చుకొని, తనకు గలిగిన యవమానము భరింపలేక మండిపడి యావృషభముం జిత్రవధ గావించి కసిదీర్చుకొనెను.

పిమ్మటఁ గొంతసేపటికిఁ బ్రాణమిత్రుడగు సంజీవకుని జంపుట యక్రమమని తలఁపు గలిగి పింగళకుఁడు దుఃఖా క్రాంతుఁడై యిట్లు చింతించెను.

" పాపము లన్నిటికి రాజే పాత్రుఁ డగును. ఇతరులు రాజ్యసుఖ మనువింతురు. రాజ్యమునఁ గొంతభాగముం గోలు పోయిన నెన్నఁడైనను మరల సంపాదింపవచ్చును. ఉత్తము లగు సేవకులం గోలుపోయిన యెడల నట్టివారు తిరిగి లభించుట యసంభవము. "

ఇట్లు విచారించుచున్న పింగళకుం జూచి దమనకుఁడు " స్వామీ ! పగవానిం జంపి విచారించుట పాడిగాదు. సుతుఁడుగాని, సోదరుఁడుగాని, సఖుఁడుగాని, యపాయముఁ గలిగింపఁ దలఁచెనేని సంపదల నందగోరు రాజు వారిం జంపితీర వలయును. ధర్మార్థ కామముల తత్త్వమెఱింగిన వారెవరు నతి దయకు లోనుగారాదు. మితిమీఱిన యోరిమిగలవాఁడు చేతఁ జిక్కిన ఫలమయిన ననుభవింపఁ జాలఁడు. మిత్రుల యెడలను, శత్రుల యెడలను సమానముగా శాంతిఁ బూనుట యోగులకు మాత్రమే తగును. ఆశాంతియే యపరాధులందు జూపుట రాజులకు దోసమగును. అహంకారము చేతను, రాజ్యమందలి యాశచేతను బ్రభుపదము నాక్రమింపఁ దలచు వానికి మరణదండన మొక్కటియే ప్రాయశ్చిత్తము.

జాలిగలరాజు, సర్వభక్షకుఁడగు బ్రాహ్మణుఁడు, వశము దప్పిన భార్యయు, దుష్టచిత్తుఁ డగు మిత్రుఁడును బ్రమాదముఁ గలిగించు నధికారియుఁ, జేసినమేలు మఱచు వాఁడును సర్వదా విడువందగువారు. రాజనీతి వేశ్యాంగన

వంటిది. ఒకపుడు సత్యముతోను మఱియొకపు డసత్యముతోను గూడినదై యుండును. ఒకపుడు గాఠిన్యము గలిగియుండి మరియొకపుడు ప్రియవచనములతోఁ గూడినదై యుండును. ఒకపుడు క్రూరముగను నింకొకపుడు దయా యుక్తముగను నుండును. ఒకపుడు లోభముగలిగియుండి మఱియొకపుడు దానగుణముతో నొప్పు చుండును. ఒకపు డతివ్యయము గలదియు, మఱొకపుడు విస్తారమయిన ధనము, రత్నములు సంపాదించునదియునై యుండును." అని బోధించి యోదార్పఁగాఁ బింగళకుఁడు సరిపెట్టుకొని యూరడిలి యుండెను. దమనకుఁడును సంతసిల్లి 'సకలజనులకు శుభమును, రాజునకు జయమును వర్ధిల్లునుగాక' యని పలికి తిరిగి రాజాదరము నొంది సుఖముగా నుండెను."

అని వినిపించి విష్ణుశర్మ రాజపుత్రులతో నిటులనెను. "మీ రిపుడు మిత్రభేదము సాంతముగా వినియుంటిరి. మీరును శత్రునిలయములం దిటులే మిత్రభేదముఁ గల్పించి విజయముం గాంచి వర్ధిల్లుఁ" డని పలికెను.

సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము